




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778

రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 219 పేజీలు : 12, వెల రూ. 5/- గురువారం, అక్టోబరు 1, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA












# సోషల్ మీడియాలో ఫుల్ బిజీగా ఉన్నారా...



ప్రపంచ వ్యాప్తంగా సోషల్ మీడియా అనేది వైరల్ ఇష్యూ అయిన సంగతి తెలిసిందే. పదేళ్ల చిన్నారి నుంచి పండు ముసలివారి వరకు ఆల్ మోస్ట్ అందరికీ సోషల్ మీడియాలో అకౌంట్ ఉండడం సర్వసాధారణమై పోయింది. ఈ క్రమంలో కొంతమంది ఈ సోషల్ మీడియాకు ఎడిక్ట్ అయిపోతున్న సంగతి తెలిసిందే. రోజులో ఎన్నో గంటల పాటు ఈ ప్రపంచంలో గడపడమే ప్రపంచంగా బ్రతుకుతున్నవారూ పెరిగిపోతున్నారు. ఈ సమయంలో సోషల్ మీడియా యూజర్ల విషయంలో మానసిక నిపుణులు కీలక విషయాలు చెబుతున్నారు.అవును... సోషల్ మీడియా వల్ల పలు దుష్ప్రభావాలు ఉన్నాయని మానసిక నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇందులో భాగంగా... సోషల్ మీడియాలో చేసే పోస్టులను అదేపనిగా చూడడం వల్ల ఆత్మన్యూనత, అభద్రత భావం వంటి మానసిక సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. ఇదే సమయంలో... సోషల్ మీడియాలో ఉండేదంతా నిజమేనన్న భావనలో కొంతమంది తమను తాము తక్కువ చేసుకుంటున్నారని మానసిక నిపుణులు చెబుతున్నారు.ఇదే క్రమంలో తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనంలో సోషల్ మీడియా అనేది వ్యక్తి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తేలిందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో భాగంగా... జర్మన్ సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్, రూర్ వర్సిటీకి చెందిన పరిశోధకులు చేపట్టిన అధ్యయనంలో... సోషల్ మీడియా వాడకాన్ని ఎంత తగ్గిస్తే, మానసిక ఆరోగ్యం అంత మెరుగుపడుతుందని తేలిందని తెలుస్తుంది.సోషల్ మీడియా వాడకాన్ని ఎంతగా తగ్గిస్తే, అంతగా మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని.. రోజులో కనీసం 30 నిమిషాలైనా సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించుకుంటే చాలా మంచిదని.. దీనిద్వారా పనిపై ఏకాగ్రత పెరగడంతో పాటు, చేసే పనిలో సంతృప్తి దక్కుతుందని పరిశోధకులు చెబుతున్నారు.తాజాగా "బిహేవియర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ" జర్నల్ లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం సుమారు 166 మందిని ఎంపికచేసి పరిశీలించారంట నిపుణులు.



ఇందులో భాగంగా ఎంపిక చేసుకున్నవారిలో సగం మందిని ఒక గ్రూప్ గా చేసి వారిని సోషల్ మీడియా వాడకం 30 నిమిషాలు తగ్గించమని చెప్పగా.. మిగిలిన సగం మందిని యథావిధిగా వాడమని చెప్పారట.ఈ సమయంలో పరిశోధనకు ముందు, పరిశోధన తర్వాత ఆ సభ్యులను కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు సేకరించారు. ఈ సమయంలో వీరిలో సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించిన గ్రూప్ సభ్యులు తమ మానసిక ఆరోగ్యం మెరుగుపడిందని, ఉద్యోగంలో సంతృప్తి ఉందని చెప్పారట. దీంతో సోషల్ మీడియా వాడకాన్ని తగ్గిస్తే మానసిక ఆరోగ్యం బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు.

# చావు ఎప్పుడొస్తుందో తెలుసా?

వాన రాకడ ప్రాణం పోకడ తెలియదంటారు. అందుకే వాటి సమయం గురించి ఎవరికి తెలియదు. కానీ ప్రస్తుతం సాంకేతికత పెరిగింది. పరిజ్ఞానం ఇనుమడించింది. దీంతో మనిషి పుట్టుక, చావు గురించి కొంతవరకు తెలుసుకుంటున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ గురించి మనకు తెలుసు. చాట్ జీపీటీ టెక్నాలజీతో అన్ని మార్గాల్లో సమూల మార్పులు జరిగాయి. ఓ సర్వే ప్రకారం మనిషి మరణంపై మెల్లగా నిజాలు వెల్లడవుతున్నాయి.శాస్త్రవేత్తలు ఆర్టిఫిషియాల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సాయంతో అల్గారిథమ్ తయారు చేశారు. దాని ఆధారంగా మనిషి ఎప్పుడు మరణిస్తాడని అంచనా వేస్తున్నారు. చాట్ జీపీటీ, బింగ్ ఏఐ, గూగుల్ బార్ట్ తరహాలో లైఫ్2వీఈసీ పేరుతో పిలిచే మేథతో మనకు చావు ఎప్పుడు ముంచుకొస్తుందో ముందే పసిగడుతుందట. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్లో శిక్షణ పొందిన టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ డెన్మార్క్, యూఎస్ రిసెర్సర్లు ఏఐ ఆధారిత డెత్ ప్రిడెక్టర్ ను తయారు చేశారు.సుమారు ఆరు లక్షల మందిపై సర్వే నిర్వహించారు. వారి ఆదాయం, పని, ప్రమాదాలు తదితర విషయాలపై వారి మరణంపై అంచనా వేశారు. ఇందులో ఎవరి మరణం ఎప్పుడు వస్తుందనే దానిపై మానసిక ఆరోగ్యం, నైపుణ్యం, జీతం, నాయకత్వం వంటి వాటితో ముందస్తు మరణాలకు కారణమవుతున్నాయి. యూజర్లు చాట్ జీపీటీని ఓపెన్ చేసి అందులో క్రోడింగ్ గురించి లేదంటే ఏదైనా చరిత్ర గురించి ఎలా వ్యవహరించాలనే దానిపై ఈ లైఫ్ 2 వీఈసీలో ఎప్పుడు మరణిస్తారని అడుగుతారు.మన మరణం ఎప్పుడు అనేది తెలియజేస్తుండటంతో పెరిగిన సాంకేతికతతో మన చావు ఎప్పుడు వస్తుందో డెత్ గురించి అంచనా వేస్తున్నారు.



మరణాల డేటాను అందుబాటులో ఉండటం వల్ల మన మరణం ఎప్పుడు వస్తుందో తెలుసుకుంటే బాధ కలగడం సహజమే. పెరిగిన సాంకేతికత మన ప్రాణాల మీదకు వచ్చిందని అంటున్నారు. ఈనేపథ్యంలో మరణం ఎప్పుడొస్తుందోననే బెంగ పట్టుకోవడం మామూలే.ఇలా మన టెక్నాలజీ పెరగడం వల్ల మన ప్రాణాలు ఎప్పుడు పోతాయో తెలుసుకుంటే భయం పట్టుకోవడం ఖాయం. అందుకే ఎవరు కూడా తమ ప్రాణాలు ఎప్పుడు పోతాయో తెలుసుకునేందుకు జంకుతుండటం కామన్. ఆధునికత మన ప్రాణాల గురించి చెప్పు వాస్తవాలను చాలా మంది జీర్ణించుకోలేకపోతుంటారు. అందుకే ఈ సాంకేతికత మనకు అవసరం లేదనే వాదనలు వస్తున్నాయి.





# నిద్రపోయే ముందు లెమన్ వాటర్ తాగితే

అధిక బరువు ఉన్నవారు.. బరువు తగ్గడానికి చాలా రకాలుగా ప్రయత్నిస్తుంటారు. బరువు తగ్గడానికి కొంతమంది ఆహారం మానేస్తారు. మరికొంతమంది ఫ్రూట్స్, పానీయాల్ని తీసుకుంటూ బరువు తగ్గేందుకు ప్రయత్నిస్తారు. నిద్రపోయేముందు లెమన్ వాటర్ తాగితే సులువుగా బరువు తగ్గుతారు అని తాజాగా సోషల్‌మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతుంది.ఒక గ్లాసు వేడి నీటిలో లెమన్ జ్యూస్, కొద్దిగా అల్లం రసం, రెండు మూడు లవంగాలు వేసుకుని నిద్రపోయే ముందు తాగితే బరువు తగ్గుతారు అని సోషల్‌మీడియాలో వీడియో వైరల్ అవుతుంది. అయితే ఈ నీటిని రోజూ తాగితే బరువు తగ్గుతారు అని కచ్చితంగా చెప్పలేమని వైద్యులు సూచిస్తున్నారు. నిమ్మరసం, అల్లం రసం, లవంగాలు వంటి పదార్థాలన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. వీటితో చేసిన నీటిని తీసుకుంటే అధిక బరువు కాకపోయినా.. తక్కువ బరువు తగ్గవచ్చు. ఈ నీరు అందరికి సరిపడుతుందని చెప్పలేమని వైద్యులు అంటున్నారు. ఈ నీటిని తీసుకుంటే కొందరికి వికారము, వాంతులు కూడా అవ్వొచ్చు. మీరు ఈ నీటిని ఒకసారి తాగిన తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటే.. ఈ నీటిని తీసుకోవచ్చు అని వైద్యులు సూచిస్తున్నారు.

# మెట్లు ఎక్కి దిగితే.. ఆరోగ్య ప్రయోజనాలెన్నో..!



ప్రతిరోజూ వాకింగ్, రన్నింగ్ వంటి వ్యాయామాలు చేస్తూనే ఉంటారు. అయితే సీజన్ మారినప్పుడు వ్యాయామాలు చేసేందుకు వాతావరణం అనుకూలించదు. అలాంటప్పుడు మెట్లు ఎక్కడం, దిగడం వంటి తేలికపాటి వ్యాయామాలు చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. మెట్లు ఎక్కడం, దిగడం వంటి వ్యాయామాల వల్ల శారీరక శ్రమ తక్కువగా ఉంటుంది. కానీ ఈ వ్యాయామాలు శారీరక బలంతోపాటు శక్తినిస్తాయి అని వైద్యులు చెబుతున్నారు. మెట్లపై చేతులు పెట్టి పైకి కిందకి లేస్తూ చేసే వ్యాయామాలు ఆరోగ్యాన్నిస్తాయి. రోజూ మెట్లు ఎక్కుతూ దిగుతూనే ఉంటాం. కానీ ఈ వ్యాయామం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టం. కానీ దీనివల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని వైద్యులు అంటున్నారు. మెట్లపై బాడీని ఏటవాలుగా వంచి ఒక కాలు పైకి లేపుతూ.. దించుతూ వ్యాయామం చేయాలి. స్టెప్స్‌పై చేతులుపెట్టి కాలిని మడతపెట్టి గుండె దగ్గరకు తీసుకువచ్చేలా వ్యాయమాలు ట్రై చేయొచ్చు.

# పొద్దున్నే సంగీతం వింటే ఎన్ని ప్రయోజనాలో..?!

రోజూ ఉదయాన్నే చాలామంది బద్దకంగా నిద్రలేస్తారు. లేచీ లేవగానే.. ఆరోజు చేయబోయే పనులను గుర్తుకు తెచ్చుకుంటే మరింత ఒత్తిడికి గురవుతారు. ఎంత ప్రణాళికలు వేసుకుని నిద్ర లేచినా.. మూడ్ సరిగ్గా ఉండదు. ఆ సమయంలో మీకు నచ్చిన పాటలు వింటే.. ఉల్లాసంగా ఉంటారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. పొద్దున్నే నిద్రలేవగానే.. ల్యాప్‌టాప్ ముందు పెట్టుకుని కాఫీ తాగుతూ.. ఇ-మెయిల్స్ చెక్ చేసుకోవడం.. వాటికి రిప్లై ఇవ్వడం వంటివి జరుగుతూనే ఉంటాయి. ఆ పనులతోపాటు మీకిష్టమైన సంగీతం వింటే ఆరోజంతా ఎనర్జీగా ఉంటారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

- మీరు ఉదయాన్నే ప్రశాంతంగా కొంచెంసేపు సంగీతం వింటే మానసిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ఆరోజంతా మీరు సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తారు.
- పొద్దున్నే సంగీతం వింటే.. ఒత్తిడిని తగ్గిస్తుంది. సంగీతం ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను తగ్గిస్తుంది.
- మ్యూజిక్ మీ పనిపై ప్రభావం చూపుతుంది. ఏకాగ్రతతో పనిచేసేందుకు దోహదపడుతుంది. దీనివల్ల పని మరింత మెరుగ్గా చేయగలుగుతారు.
- ఉదయాన్నే సంగీతం వింటే హృదయ మీ స్పందన రేటు పెరుగుతుంది.సంగీతం మీ సృజనాత్మకతకు ప్రేరణ కలిగిస్తుంది. సంగీతం ద్వారా కొత్త ఆలోచనలు వస్తాయి. కొత్త ఆవిష్కరణలకు ప్రేరేపిస్తుంది.






సమాజ హితం - మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 219 పేజీలు : 12, వెల రూ. 5/- గురువారం, అక్టోబరు 1, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# గత పదేళ్లు సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారు

## గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం..



**కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు**

**సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు**

**కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ**

**బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు**

**దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు**

సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.



# మోదీ-ట్రంప్ ఫోన్ కాల్..

**మోదీ-ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ**

**ట్రేడ్, డిఫెన్స్ అంశాలపై చర్చ**

**ఎనర్జీ, క్రిటికల్ టెక్నాలజీలపైనా సమీక్ష**

**భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ**

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు.

# ఫ్లైదుబాయ్‌లో ఘర్షణ...



దుబాయ్ నుంచి టెల్ అవీవ్ బయల్దేరిన 'ఫ్లైదుబాయ్' విమానంలో అత్యంత నాటకీయ, ఉద్రిక్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. విమానం గాలిలో ఉండగానే కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఈ ఘటన హైజాక్ భయాలను రేకెత్తించడంతో, విమానాన్ని సౌదీ అరేబియాలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

# ఈసీపై 'ఇండియా' కూటమి సమర శంఖం

**దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు**
**ఢిల్లీలో ఇండియా కూటమి కీలక సమావేశం**

**సీఈసీ రాజీనామా చేయాలని నేతల డిమాండ్**

**అక్టోబర్ 2 నుంచి**
**దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' మార్చ్‌లకు పిలుపు**




కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరును నిరసిస్తూ 'ఇండియా' విపక్ష కూటమి దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని కూటమి డిమాండ్ చేసింది. ఢిల్లీలో ఈరోజు జరిగిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, ఒమర్ అబ్దుల్లా, తేజస్వి యాదవ్ సహా 19 పార్టీల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందని నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ.. "ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అక్టోబర్ 2 నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో 'సేవ్ డెమోక్రసీ' పేరుతో నిరసన మార్చ్‌లు నిర్వహిస్తాం. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలందరం కలిసి ఈసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తాం," అని తెలిపారు. దేశవ్యాప్తంగా ఐదు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించామని, అందులో మొదటి సభ నవంబర్ 1న ఢిల్లీలో జరుగుతుందని ఖర్గే వివరించారు. ఈ అంశంపై రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. బీజేపీ, మోదీ, అమిత్ షా ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేస్తున్నారని, దాన్ని నాశనం చేసిన వారికి శిక్ష పడేలా చూస్తామని హెచ్చరించారు.





2

**సోషల్ మీడియాలో ఫుల్ బిజీగా ఉన్నారా...**

# పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు.



# సీఎం పర్యటన నేపథ్యంలో సిరిసిల్లలో ట్రాఫిక్ ఆంక్షలు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మేరకు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వాహనదారులకు పలు సూచనలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సిరిసిల్ల పట్టణ పరిధిలోని కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్, నేతన్న చౌక్ మీదుగా రగుడు జంక్షన్ వరకు ఎలాంటి వాహనాలను అనుమతించబోమని డీఎస్పీ తెలిపారు. వాహనదారులు పోలీస్ అధికారులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. కరీంనగర్, వేములవాడ నుంచి సిరిసిల్ల వచ్చే వాహనాలు: రగుడు జంక్షన్ నుంచి రెండో బైపాస్ మీదుగా వెంకటాపూర్ నుంచి సిరిసిల్లకు చేరుకోవాలి. లేదా మొదటి బైపాస్ మీదుగా ఎల్లమ్మ సర్కిల్ నుంచి సిరిసిల్లకు రావాలి. కరీంనగర్, వేములవాడ నుంచి ఎల్లారెడ్డిపేట, కామారెడ్డి వెళ్లే వాహనాలు: రగుడు జంక్షన్ నుంచి రెండో బైపాస్ మీదుగా వెంకటాపూర్ వైపు వెళ్లాలి. వేములవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు: మొదటి బైపాస్ మీదుగా ఎల్లమ్మ సర్కిల్ వైపు వెళ్లాలని పోలీసులు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ నాగేంద్రచారి విజ్ఞప్తి చేశారు.

# అధికారం లేకున్నా.. కేటీఆర్ వద్దకే ఎందుకు?

**విద్యార్థి నుంచి క్రీడాకారిణి వరకు.. సమస్య ఏదైనా ఆయనపైనే ఆశలు**

**ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి అండ..**
**జాతీయస్థాయి క్రికెట్‌కు ఎంపికైన యువతికి భరోసా**

**సామాజిక వర్గాల సమస్యలపైనా వినతులు.. సిరిసిల్లలో ఆసక్తికర చర్చ**






ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ: అధికారం లేదు.. పదవి లేదు.. ప్రభుత్వ యంత్రాంగం చేతిలో లేదు. అయినా వివిధ సమస్యలతో ప్రజలు కేటీఆర్‌ను ఆశ్రయిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి, తమ లక్ష్యాలను చేరుకోవడానికి ఆయన సాయం కోరుతున్నారు. ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థి నుంచి జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి ఎంపికైన క్రీడాకారిణి వరకు.. సామాజిక వర్గాల సమస్యలపై సంఘాల ప్రతినిధుల నుంచి ఇతర అవసరాలతో వచ్చే వారి వరకు కేటీఆర్‌ను కలుస్తుండటం సిరిసిల్ల ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడే కాకుండా ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఆయనను ఆశ్రయిస్తుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఉన్నత విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో ఐఐటీలో సీటు సాధించిన అజ్మీరా శరత్ తన విద్యాభవిష్యత్తుకు సంబంధించిన అవసరాల కోసం కేటీఆర్‌ను కలిశారు. ఐఐటీలో ప్రవేశం పొందినప్పటికీ, తదుపరి చదువుకు అవసరమైన ఆర్థిక, ఇతర సహకారం కోసం ఆయనను ఆశ్రయించారు. ఉన్నత విద్యలో అడుగుపెట్టిన తనకు అవసరమైన అండ అందించాలని కోరారు. మరోవైపు గంభీరావుపేట మండలానికి చెందిన అక్షర జాతీయస్థాయి అండర్-19 మహిళల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. దేశస్థాయిలో తన ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమవుతున్న ఆమె.. క్రీడా ప్రయాణంలో ఎదురయ్యే అవసరాల కోసం కేటీఆర్‌ను కలిసి సహకారం కోరారు. ఒకరి లక్ష్యం ఉన్నత విద్య కాగా.. మరొకరి ఆశయం క్రికెట్‌లో రాణించడం. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఇద్దరూ తమ అవసరాల కోసం ఒకే నాయకుడిని ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యక్తిగత అవసరాలే కాకుండా సామాజిక వర్గాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కూడా కేటీఆర్‌ను పలువురు కలుస్తున్నారు. ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యలు, క్రీడాకారుల అవసరాలు, సామాజిక వర్గాల ఇబ్బందులు.. ఇలా విభిన్న అంశాలపై వినతులు అందుతుండటంతో ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు కేటీఆర్‌ను ఒక వేదికగా భావిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రధాన బాధ్యత ప్రభుత్వానిదే. సంబంధిత శాఖలు, అధికారులు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే ప్రజలు తమకు పరిచయమున్న నాయకులను ఆశ్రయించడం రాజకీయాల్లో సాధారణమే. గతంలో ప్రజాప్రతినిధిగా, మంత్రిగా ఉన్న సమయంలో ఏర్పడిన పరిచయాలు, సంబంధాలు కూడా నాయకులను ప్రజలకు చేరువ చేస్తుంటాయి. ప్రస్తుతం అధికారంలో లేకపోయినా కేటీఆర్‌ను వివిధ వర్గాల వారు కలుస్తుండటం ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. తమ సమస్యలను ఆయన వింటారని, సంబంధిత వ్యక్తులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారనే నమ్మకంతోనే కలుస్తున్నామని పలువురు చెబుతున్నారు. రాజకీయాల్లో అధికార మార్పులు సహజం. ప్రభుత్వాలు మారినా ప్రజా సమస్యలు మాత్రం కొనసాగుతుంటాయి. వాటి పరిష్కారం కోసం ప్రజలు అందుబాటులో ఉన్న నాయకులను ఆశ్రయిస్తుంటారు. కేటీఆర్‌ను కలుస్తున్న విద్యార్థులు, క్రీడాకారులు, సంఘాల ప్రతినిధుల విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. తమ అవసరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి మార్గం లభిస్తుందనే ఆశతో వారు ముందుకు వస్తున్నారు. ఇది రాజకీయ అభిమానం కావొచ్చు.. గతంలో అందించిన సహకారంపై ఏర్పడిన నమ్మకం కావొచ్చు.. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశ కావొచ్చు. కారణాలు వేర్వేరైనా సమస్యలతో ఆయనను కలుస్తున్న వారి నేపథ్యాలు ఆసక్తికరంగా మారాయి. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత కాగా, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రతిపక్షాల విధుల్లో ఒకటి. ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ప్రతిపక్ష నాయకులకు కూడా కీలకమే. సిరిసిల్ల ప్రాంతంలో కేటీఆర్‌ను కలుస్తున్న వారి వరుస ఈ అంశాన్ని మరోసారి చర్చకు తీసుకొస్తోంది. ఒక విద్యార్థి చదువు కోసం.. ఒక క్రీడాకారిణి తన లక్ష్యం కోసం.. ఒక సామాజిక వర్గం తమ సమస్యల పరిష్కారం కోసం ఆయనను ఆశ్రయించడం గమనార్హం. అధికారం ఎవరి చేతిలో ఉందన్నది రాజకీయాల్లో ఒక అంశమైతే.. ప్రజలు తమ సమస్యలతో ఎవరిని ఆశ్రయిస్తున్నారన్నది మరో అంశం. ఈ రెండింటి మధ్య ప్రజలతో నాయకులకు ఉన్న అనుబంధం, వారి నుంచి అందుతున్న స్పందనపై సిరిసిల్లలో చర్చ సాగుతోంది.



## భీమేశ్వర స్వామిని దర్శించుకున్న కామారెడ్డి ఎస్పీ

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 30: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీ రాజేష్ చంద్ర (ఐపీఎస్) బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీ రాజేష్ చంద్రకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి సాంప్రదాయబద్ధంగా కోడె మొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఎస్పీకి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ ప్రతాప నవీన్ కుమార్ ఎస్పీకి స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.ద

# సీఎం సభకు ముందే ప్రతిపక్ష నేతల అరెస్టులు!

**తోట ఆగయ్యకు హౌస్ అరెస్ట్..**
**పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలు పోలీసుల అదుపులో**

**ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? : ప్రతిపక్ష నేతల ఆగ్రహం**



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 30 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన, సిరిసిల్లలో నిర్వహించనున్న బహిరంగ సభ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను పోలీసులు ఆయన స్వగృహంలోనే హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా మండలంలోని పలుగ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ఇళ్లకు పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు ఆయా పార్టీల నాయకులు తెలిపారు. ఈ పరిణామంపై మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, బీజేపీ నేత రంజిత్ తదితరులు స్పందిస్తూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో సహజమైన హక్కులని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ముందస్తు అరెస్టులు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు.

**గతంలోనూ ఇదే పరిస్థితి.. ఇప్పుడు కూడా కొనసాగుతోందా?**

ప్రతిపక్ష నాయకుల ముందస్తు అరెస్టులపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో కూడా జిల్లాలో ముఖ్య నేతల సభలు, పర్యటనల సమయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించిన సందర్భాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనల సమయంలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు నిరసనలు చేపట్టకుండా ముందస్తు అరెస్టులు చేయడం, ముఖ్య నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం వంటి చర్యలు చోటుచేసుకుంటున్నాయని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి.

**ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు మాటేమిటి?**

ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను ముందస్తు చర్యల పేరుతో అణచివేయడం సరికాదని ప్రజాస్వామిక వాదులు అభిప్రాయపడుతున్నారు. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం అయినా ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్షాల హక్కును గౌరవించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. అయితే ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా పరమైన కారణాలు, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారా అన్నది అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. సభ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో ముందస్తు అదుపులోకి తీసుకున్న నాయకుల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.



## భీమేశ్వర స్వామిని దర్శించుకున్న వేములవాడ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఉమ్మడి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేలకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వేద మంత్రోచ్చారణల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఎమ్మెల్యేలకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్, ఏఈవో మహేష్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పీఆర్వో పెరిక శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యేలకు స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఆలయ సిబ్బంది, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ కుట్టు మిషన్లు అందించాం: కాంగ్రెస్ పార్టీ నాయకులు

అరుణ ప్రభ న్యూస్ నారాయణఖేడ్ : అర్హులందరికీ కుట్టు మిషన్లు అందించామని నారాయణఖేడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద.షారుఖాన్.మహేష్ చౌహన్.బాణాపురం రాజు.లక్ష్మణ్. మైతాబ్. సుబ్బు.గోపాల్ రెడ్డి. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ముంతాజ్.మోహిత్. నారాయణఖేడ్ పట్టణంలోని విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది టిఆర్ఎస్ నాయకులు నాయకులు ముస్లిం మహిళ సోదరులకు అందించినటువంటి కుట్టుమిషన్లు అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడం తగదని వారు అన్నారు 200 కుట్టు మిషన్లు అర్హులకే పార్టీలకు అతీతంగా అందించడం జరిగిందని వారు తెలిపారు గత బి ఆర్ ఎస్ హయాంలో 300 కుట్టుమిషన్లు వచ్చాయని అవి ఎవరికిచ్చారు ఇప్పటివరకు కూడా ఎవరికి కూడా తెలవడం లేదని మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు ఆరోపించడం జరిగింది. తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేదల కోసమే తమ నాయకులు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ సెట్ కార్ నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మహిళా అధికారికంగా మీటింగ్ ఏర్పాటు చేసి 200 కుట్టు మిషన్లను అందించడం జరిగిందని వారు తెలిపారు. మైనారిటీ శాఖ మంత్రివర్యులు అజారుద్దీన్ ను కలిసి నారాయణఖేడ్ శాసనసభ్యులు 500 కుట్టుమిషన్లను నారాయణఖేడ్ నియోజకవర్గానికి మంజూరు చేయాలని తెలపడం జరిగింది. టిఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం ఇకనైనా మానుకోవాలని వారు తెలిపారు .




## సిరిసిల్ల అభివృద్ధికి భారీగా నిధులు

**సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సిరిసిల్లలో నేతన్న బజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. నేతన్నల జీవనోపాధి, చేనేత ఉత్పత్తుల ప్రోత్సాహానికి అనుగుణంగా బజార్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అలాగే సిరిసిల్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సిరిసిల్లతో పాటు వేములవాడలో కలిపి రూ. 200 కోట్ల వ్యయంతో ఈ పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. సిరిసిల్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. విద్యా రంగంలో మౌలిక వసతులను మెరుగుపరిచే దిశగా ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. పరిపాలనా సౌకర్యాల విస్తరణలో భాగంగా సిరిసిల్లలో ఆర్డీవో కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ప్రజలకు రెవెన్యూ, పరిపాలనా సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అదేవిధంగా సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మహిళా సంఘాల కార్యకలాపాలు, మహిళల ఆర్థిక సాధికారతకు ఈ భవన్ ఉపయోగపడనుంది. పోలీసు శాఖ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా సిరిసిల్లలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ నిర్వహణ, పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుంది. సిరిసిల్లలో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులతో పట్టణ మౌలిక వసతులు, విద్య, పరిపాలన, మహిళా సాధికారత, పోలీసు సేవల రంగాల్లో మరింత పురోగతి సాధించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



## సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లాలో భారీ బందోబస్తు

**భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న ఎస్పీ మహేష్ బి. గితే**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 30: రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పోలీస్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్ వద్ద సిబ్బంది విధులు, ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాల్లో రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు పలు సూచనలు చేస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటూ, వారికి కేటాయించిన విధులను అప్రమత్తంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు భద్రతా ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎస్పీ మహేష్ బి. గితే పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# సౌకర్యాలు లేక ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీలో రోగుల అవస్థలు

## పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు.. రోగనిర్ధారణ పరీక్షలకూ కొరత.

## 30 పడకల ఆసుపత్రిలో వసతులు అసంపూర్తి.. 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకుల డిమాండ్.



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాల (సీహెచ్‌సీ)లో సరైన వైద్య సదుపాయాలు, అవసరమైన సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 50 వేల మందికి పైగా ప్రజలకు ఈ ఆసుపత్రి ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్నప్పటికీ, అందుకు అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది, పరికరాలు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. రోజుకు సుమారు 200 నుంచి 500 మంది వరకు రోగులు ఆసుపత్రికి వస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో ప్రజలకు సకాలంలో వైద్యం అందడం లేదని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్లు, ఇతర అనారోగ్య సమస్యలతో పిల్లలు, వృద్ధులు, మహిళలు ఆసుపత్రికి వస్తున్నా అవసరమైన రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు తగిన యంత్రాలు, సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. బీజేపీ నాయకులు ఆసుపత్రిని సందర్శించి రోగులతో మాట్లాడగా, ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలపై వారు తమ ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. కొన్ని సందర్భాల్లో ఒక్క బెడ్‌పై ఇద్దరు రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కొన్ని మంచాలపై బెడ్‌షీట్లు కూడా లేకపోవడంతో ప్లాస్టిక్ పేపర్ వేసి రోగులకు వైద్యం అందిస్తున్న దృశ్యాలు కనిపించాయని తెలిపారు. అంతేకాకుండా సెలైన్ బాటిళ్లు పెట్టేందుకు అవసరమైన స్టాండ్లు లేకపోవడంతో కిటికీల ఊసలకు బ్యాండేజ్ క్లాత్‌తో సెలైన్ బాటిళ్లను కట్టి చికిత్స అందిస్తున్న పరిస్థితులు ఉన్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యం పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో అవసరానికి అనుగుణంగా పది మందికి పైగా వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ముగ్గురు వైద్యులతోనే సేవలు కొనసాగుతున్నాయని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దీంతో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సేవలు అందించడం కష్టంగా మారిందని ఆసుపత్రి వైద్య సిబ్బంది తమతో చెప్పినట్లు వారు తెలిపారు. 30 పడకల ఆసుపత్రికి సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు వసతులు కల్పించే పనులు ప్రారంభించినప్పటికీ, అవి పూర్తికాకపోవడంతో రోగులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి రాలేదని వైద్యులు తెలిపినట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు. ఎల్లారెడ్డిపేట మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో అన్ని వైద్య విభాగాలను ఏర్పాటు చేసి, అవసరమైన సంఖ్యలో వైద్యులు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం పట్ల ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన అన్నారు. ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయకుండా ప్రైవేటు ఆసుపత్రులపై ప్రజలు ఆధారపడే పరిస్థితి ఏర్పడుతోందని బీజేపీ నాయకులు విమర్శించారు. జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షుడు గంట బాలకిషన్ గౌడ్, వార్డు మెంబర్ కొత్త చెన్నయ్య, అంతర్పుల తిరుపతి, పందిర్ల సత్తయ్య, బూత్ అధ్యక్షుడు ఎండి అబ్దుల్లా, చందుపట్ల నాగిరెడ్డి, సంతోష్, ముద్దం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ స్కేట్ గేమ్స్ 2026కు భారత్ తరఫున తెలంగాణ యువ క్రీడాకారుడు భూషణబోయిన రోహిత్‌రాజ్

## ఏడేళ్లుగా జాతీయస్థాయిలో రెండేళ్లుగా తెలంగాణ జట్టు కెప్టెన్



హైదరాబాద్ సెప్టెంబర్ 30 (అరుణ ప్రభ) తెలంగాణ యువ ఇన్‌లైన్ హాకీ క్రీడాకారుడు భూషణబోయిన రోహిత్ రాజ్ అరుదైన ఘనత సాధించాడు. గత ఏడేళ్లుగా జాతీయస్థాయి ఇన్‌లైన్ హాకీ పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న రోహిత్.. గత రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అతని ప్రతిభ, నాయకత్వ సామర్థ్యాన్ని గుర్తించిన నేపథ్యంలో 2026 వరల్డ్ స్కేట్ గేమ్స్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. పరాగ్వేలోని అసున్సియోన్‌లో అక్టోబర్ 2 నుంచి 18 వరకు జరగనున్న వరల్డ్ స్కేట్ గేమ్స్--2026లో జూనియర్ మెన్ ఇన్‌లైన్ హాకీ విభాగంలో రోహిత్ రాజ్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రపంచస్థాయి క్రీడాకారులు పాల్గొనే ఈ ప్రతిష్ఠాత్మక పోటీలకు భారత్ నుంచి ఎంపిక కావడం రోహిత్ క్రీడా జీవితంలో కీలక మైలురాయిగా నిలిచింది. రోహిత్ రాజ్ గత ఏడేళ్లుగా జాతీయస్థాయి ఇన్‌లైన్ హాకీ పోటీల్లో పాల్గొంటున్నాడు. తెలంగాణ తరఫున పలు జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తూ తన ప్రతిభను చాటుకున్నాడు. దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో అనుభవజ్ఞులైన క్రీడాకారులతో పోటీపడుతూ తన ఆటతీరును మెరుగుపరుచుకున్నాడు. నిరంతర సాధన, క్రమశిక్షణ, కఠిన శిక్షణతో ఇన్‌లైన్ హాకీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రీడా ప్రతిభతో పాటు నాయకత్వ లక్షణాలను కూడా ప్రదర్శిస్తున్న రోహిత్ గత రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ఇన్‌లైన్ హాకీ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. జట్టు సభ్యులతో సమన్వయం చేసుకుంటూ పోటీల్లో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం కూడా భారత జట్టుకు ఎంపిక కావడంలో కీలకంగా నిలిచింది. జాతీయస్థాయిలో ఏడేళ్లుగా సాగిన రోహిత్ క్రీడా ప్రయాణం ఇప్పుడు అంతర్జాతీయ వేదికకు చేరుకుంది. తెలంగాణ నుంచి భారత్ తరఫున వరల్డ్ స్కేట్ గేమ్స్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. రోహిత్ ఎంపికపై అతని కుటుంబ సభ్యులు, కోచ్‌లు, సహచర క్రీడాకారులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారతదేశానికి, తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రోహిత్ సాధించిన ఈ ఘనత తెలంగాణలోని మరింత మంది యువతను ఇన్‌లైన్ హాకీ, రోలర్ స్పోర్ట్స్ వైపు ఆకర్షిస్తుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలి

## 12వ పిఆర్సి అమలు చేయాలి.. సి.ఐ.టి.యు డిమాండ్



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని,అలాగే మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచి మూడు సంవత్సరాలు పై పడుతున్నా ఇంతవరకు జీతాలు పెంచలేదని, 12వ పి.ఆర్.సి కమిషన్ అమలు చేయాలని, ప్రైవేటీకరణ ఆపాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రోజు ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చనిపోయిన కార్మికులు, రిటైర్మెంట్ అయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ (గ్రాట్యుటీ, పెన్షన్ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పి.ఆర్.సి జీతాలు,డిఏ, మరియు కరువు భత్యం వర్తింపజేయాలని, నాటి ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు నైపుణ్యంతో కూడిన జీతాలు చెల్లిస్తామంటూ జీవో ఆర్టీ నెంబర్ 1615 ను 2013లో జారీ చేసిందని, ఈ జీవోను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ పట్టణాల్లో కార్మికులు అమలు చేయాలని ధర్నాలు నిర్వహించడం జరిగిందని.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్,డీజిల్, నిత్యవసర సరుకుల ధరలను అదుపు చేయడం లేదని, గత ఎనిమిదేళ్లలో అన్ని రకాల ధరలు వందలరెట్లు పెరిగిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు రెట్టింపు అయ్యాయని, పిల్లల విద్యా ఫీజులు, వైద్య ఖర్చులు ఇంటి అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయని, అయితే ఉద్యోగుల, కార్మికుల జీతాలు ప్రభుత్వాలు సకాలంలో పెంచడం లేదని, కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులకు ఏళ్ల తరబడి జీతాలు పెరగకపోవడం వల్ల జీవితాంతం నష్టపోతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయమైన కోరికలు అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ వై.మల్లికార్జున్ రావు కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దారా కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు డి.మణెమ్మ, కమిటీ సభ్యులు గూడూరు మని, గద్దల మేరీ,పద్మమ్మ, పెంచలమ్మ ,నారాయణమ్మ, ఎం జయలక్ష్మి, గూడూరు సి.ఐ.టి.యు కార్యదర్శి బి. వి.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల చెరువు అభివృద్ధికి మరో అడుగు

## రోడ్డు, హైలెవల్ బ్రిడ్జి మంజూరుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి



అరుణ ప్రభ:– అశ్వాపురం కాకతీయుల కాలం నుంచి ప్రసిద్ధి చెందిన తుమ్మల చెరువు అభివృద్ధికి మరో ముందడుగు పడింది. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలు చెరువుకు చేరుతున్న నేపథ్యంలో రైతులు, గ్రామీణ ప్రజలకు మరింత ప్రయోజనం కలిగేలా మౌలిక వసతులు కల్పించాలని మల్లెలమడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు కోరారు. తుమ్మల చెరువు గ్రామ రోడ్డు నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు, అలుగు తూము వద్ద హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరుతూ పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. తుమ్మల చెరువు కట్టకు సరైన రోడ్డు సౌకర్యం లేక రైతులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులను రవాణా చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలుగు తూము వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే వర్షాకాలంలో నీటి ప్రవాహం కారణంగా రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. తుమ్మల చెరువుకు గోదావరి జలాలను అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, రోడ్డు మరియు హైలెవల్ బ్రిడ్జి మంజూరు కోసం ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతం రామకృష్ణ, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, చెంచల రాము, పాటి ప్రదీప్‌రెడ్డి, బారాస్ సంపత్, గొడ్ల నాగేశ్వరరావు, అణువుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం సభా వేదిక, ఏర్పాట్లను పరిశీలించిన రాజ్యసభ సభ్యుడు, ప్రభుత్వ విప్‌లు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలిసి పరిశీలించారు. సభా వేదిక, సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లతో పాటు ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమానికి సంబంధించిన పాదయాత్ర స్థలాన్ని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ప్రజల రాకపోకలు, ఇతర సౌకర్యాలపై అధికారులు, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభ విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నాయని నాయకులు తెలిపారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సు

### 90 రోజుల పాటు శిక్షణ.. ఉద్యోగ అవకాశాలకు దోహదం




ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 30 (అరుణప్రభ): తెలంగాణలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో శ్రీ సత్యసాయి దక్షత కార్యక్రమం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సును అక్టోబర్ 2వ తేదీన ప్రారంభించనున్నట్లు సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు తెలి పారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అర్హులైన నిరుపేద యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని వారు కోరారు. వేగంగా అభి వృద్ధి చెందుతున్న డేటా రంగంలో ఉద్యోగాలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను యువతకు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. 2022 నుంచి 2026 మధ్య MSc, B.Tech, M.Tech, MCA విద్యార్హతలు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆఫ్‌లైన్ విధానంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల ఆధ్వర్యంలో మూడు దశల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మొత్తం 90 రోజుల పాటు నిర్వహించే ఈ కోర్సులో Basic & Advanced Python, SQL, AI Tools, Soft Skills, Career Counsellingతో పాటు డేటా ఇంజినీరింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ నియామకానికి అవసరమైన సహాయాన్ని కూడా అందిస్తామని తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన గత బ్యాచ్‌లో సుమారు 350 మంది విద్యార్థులు శిక్షణ పొందగా, వారిలో 100 మందికి పైగా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు www.dakshata.ai వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9052372023 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన యువతకు ఆధునిక నైపుణ్యాలను అందించి, తెలంగాణ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే శ్రీ సత్యసాయి దక్షత కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.



## తెలంగాణలో వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

### శంషాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన 50 మంది యాత్రికులు

తెలంగాణలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు ఇబ్బందుల నుంచి బయటపడాలని ఆకాంక్షిస్తూ... మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని శంషాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన ఇస్లామిక్ యాత్రికులు తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సుమారు 50 మంది యాత్రికులు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థిస్తామని యాత్రికులు తెలిపారు. మక్కా, మదీనాలలో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్రా యాత్రకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని యాత్రికులు సూచించారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయని, అందుకే తాము ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్నామని తెలిపారు. తమ బృందంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు ఉన్నారని వెల్లడించారు. మక్కా, మదీనాలలో సుమారు 15 రోజులపాటు ఉండి ప్రార్థనలు నిర్వహించనున్నట్లు యాత్రికులు తెలిపారు. తెలంగాణలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు ఇబ్బందుల నుంచి బయటపడాలని ప్రత్యేకంగా ప్రార్థనలు చేస్తామని చెప్పారు. తమ ఉమ్రా యాత్ర సురక్షితంగా పూర్తిచేసుకుని క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన నేహా రెడ్డి



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గూడూరు కి చెందిన చెన్నూరు నేహా రెడ్డి అండర్ 19 క్రికెట్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ( ఏ సి ఏ ) సబ్ సెంటర్ అయిన గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషా రెడ్డి స్టేడియంలో కోచ్ లవ కుమార్ వద్ద శిక్షణ పొందుతున్నారు. విద్యార్థిని ప్రస్తుతం వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్నది. రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడంతో గూడూరు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాల చేరాలని పలువురు తెలిపారు.

### వరుసగా మూడోసారి లడ్డూను కైవసం చేసుకున్న

# గుడిశా ప్రతిభా సాయికుమార్ గౌడ్

### గణనాథుని లడ్డూ వేలంలో రూ.1,01,116



సెప్టెంబర్ 30,అరుణ ప్రభ : ఓల్డ్ మల్లాపూర్ యువ శక్తి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 43వ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్న గణనాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీ గణనాథుని లడ్డూ వేలం భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా సాగింది. ఈ వేలంలో 25 కిలోల గణనాథుని లడ్డూను గుడిశా ప్రతిభా సాయికుమార్ గౌడ్ రూ. 1,01,116/-కు కైవసం చేసుకున్నారు. యువ శక్తి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలంలో కూడా గుడిశా ప్రతిభా సాయికుమార్ గౌడ్ రెండు సార్లు లడ్డూను కైవసం చేసుకున్నారు. తాజాగా మూడోసారి కూడా లడ్డూను సొంతం చేసుకోవడం విశేషంగా నిలిచింది. లడ్డూ వేలం కార్యక్రమం సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో యువ శక్తి యూత్ క్లబ్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### నారాయణఖేడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్.. స్వచ్ఛతా హి సేవా 2026



"పరిశుభ్రత ఒకరి బాధ్యత కాదు... మనందరి బాధ్యత. పరిశుభ్రమైన సమాజమే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది." మున్సిపల్ కమిషనర్ స్రవంతి.వైస్ చైర్మన్ దారం శంకర్ కౌన్సిలర్లు వివేకానంద.షారుఖాన్.బాణాపురం రాజు .గోపాల్ రెడ్డి .సుబ్బార్. మహేష్ చౌహన్.మైతాబ్.లక్ష్మణ్.కో-ఆప్షన్ సభ్యులు మోహిద్. శానిటేషన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మరియు పారిశుద్ధ్య కార్మికుల సమిష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛతా హి సేవా 2026 కార్యక్రమం నిర్వహించబడింది. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగాలి, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా కంటి పరీక్షల శిబిరాన్ని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. "పరిశుభ్రమైన పట్టణం కోసం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిశుభ్రత విషయంలో రాష్ట్రంలోనే ప్రథమంగా ఉంచేలా అందరు చూడాలని వారు తెల్పడం జరిగింది



### క్రీడా ప్రాంగణంలో

## భద్రాద్రి కీర్తి.. పతక విజేతలకు ఎస్పీ సత్కారం

అరుణ ప్రభ:- భద్రాద్రి కొత్తగూడెం చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ జిల్లా ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న యువ క్రీడాకారులను జిల్లా పోలీసు అధికారి రోహిత్ రాజు ఐపీఎస్ అభినందించి ఘనంగా సత్కరించారు. పాండిచ్చేరిలో జరిగిన దక్షిణ మండల జాతీయ క్రీడా పోటీల్లో భద్రాచలానికి చెందిన ఎస్కే. అఫ్రీన్ అండర్-18 జావెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించారు. అదే పోటీల్లో బి. పృథ్వికా అండర్-14 జావెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించారు. హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ జాతీయ పోటీల్లో అశ్వాపురానికి చెందిన కే. నవ్య అండర్-16 జావెలిన్ త్రోలో రజత పతకం సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పతక విజేతలు ఎస్కే. అఫ్రీన్, బి. పృథ్వికా, కే. నవ్యలను ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సన్మానించి అభినందించారు. వీరికి శిక్షణ అందించిన కోచ్ జె. గిరిప్రసాద్‌ను కూడా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ముందుకు సాగాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధించడం అభినందనీయమని, క్రమశిక్షణతో నిరంతరం సాధన చేస్తే మరిన్ని విజయాలు సాధించవచ్చని తెలిపారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

# సఫాయి కార్మికుల ఆరోగ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యం

### జిల్లా పంచాయతీ అధికారి అనూష

### గ్రామ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం : జడ్పీ సీఈవో నాగలక్ష్మి






అరుణ ప్రభ :- సారపాక స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్షా శిబిరం--2026 కార్యక్రమాన్ని సారపాక గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సఫాయి కార్మికుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి అనూష మాట్లాడుతూ, గ్రామాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమైనవని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు పరిశుభ్రమైన పరిసరాలు అవసరమని, ఆ పరిశుభ్రతను కాపాడటంలో సఫాయి కార్మికులు ప్రతిరోజూ ఎంతో బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించడంతో పాటు వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య పనులు నిర్వహించే సమయంలో కార్మికులు తప్పనిసరిగా రక్షణ పరికరాలను వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా చేతి తొడుగులు, మాస్కులు, రక్షణ పాదరక్షలు తదితర రక్షణ పరికరాలను ఉపయోగించాలని తెలిపారు. పారిశుధ్య పనుల వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సఫాయి కార్మికులకు ప్రభుత్వపరంగా అందుబాటులో ఉన్న బీమా, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలను అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమం కేవలం ఒక కార్యక్రమానికే పరిమితం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అన్నారు. వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సఫాయి కార్మికులు చేస్తున్న సేవలుప్రశంసనీయమని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగలక్ష్మి అన్నారు. గ్రామంలోని వీధులు, ప్రధాన రహదారులు, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.ప్రజలు కూడా పారిశుధ్య నిర్వహణలో పంచాయతీకి సహకరించాలని కోరారు. ఇళ్ల నుంచి వెలువడే చెత్తను నిర్దేశించిన ప్రాంతాల్లోనే వేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పరిశుభ్రత అనేది కేవలం పంచాయతీ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన గ్రామాన్ని నిర్మించగలమని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సఫాయి కార్మికులకు బీమా సౌకర్యం కల్పించడంతో పాటు వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రక్షణ పరికరాల కిట్లను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు సఫాయి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, అవసరమైన సౌకర్యాలపై వివరాలు సేకరించారు. కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జమలారెడ్డి,ఎంపిఓ రామకృష్ణ ,సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్,ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్,ఐటిసి అధికారి చెంగల్ రావు,పాలకమండలి సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రవి, సిబ్బంది, సఫాయి కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.



### ఎస్ఐఆర్ ఫేజ్-2

## విజయవంతానికి కార్యకర్తలు కృషి చేయాలి

### బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీత పిలుపు

అరుణ ప్రభ:- బూర్గంపాడు మండలంలోని అంజనాపురం గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్ఐఆర్ రాష్ట్ర కన్వీనర్ కరణం పరిణీతకు ఘన సన్మానం జరిగింది. బీజేపీ సీనియర్ నాయకుడు భూక్యా సీతారాం నాయక్ నివాసానికి ఆమె విచ్చేయగా, బంజారా మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్యా దివ్యశ్రీ, భూక్యా సీతారాం నాయక్‌లు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరణం పరిణీత మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఫేజ్--2 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో ప్రజల్లోకి వెళ్లి ఎస్ఐఆర్‌కు సంబంధించి ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుడగం రవికుమార్, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, మాదారపు లక్ష్మణ్, దున్నపోతుల రాజు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో అండగా.. అంత్యక్రియలకు ఆర్థిక సాయం

### ::: మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య ఔదార్యం

అరుణ ప్రభ:- అశ్వాపురం ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య ఆచరణలో చూపిస్తున్నారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు తనవంతు సహాయాన్ని అందిస్తున్నారు. మొండికుంట గ్రామానికి చెందిన సోయం బోడయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ మర్రి సంధ్య ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బోడయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా తనవంతు సాయంగా రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని సర్పంచ్ భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న సర్పంచ్ మర్రి సంధ్యను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చలమల్ల శివారెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసరబాద శ్రీనివాస్, పాటి మన్మథరెడ్డి, రామగిరి భాస్కర్, ఎంగలి బిక్షంరెడ్డి, అంబటి కర్ర శ్రీను, తెల్లం లాలయ్య, పాయం ఎర్రయ్య, సోయం సాంబయ్య, సోయం వెంకన్న, పర్సిక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక పూజలు



### అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని

### భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన ఎమ్మెల్యే

విశాఖపట్నం: అరుణ ప్రభ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. 37వ వార్డు జబ్బార్ తోట, 35వ వార్డు వెలంపేట ప్రాంతాల్లోని మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం భక్తుల కోసం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తిభావంతో పాటు ఐక్యత, సేవాభావం, సామాజిక స్ఫూర్తిని పెంపొందించేలా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమాల్లో కూటమి నేతలు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్

### 80 గ్రాముల మెథాంఫెటమైన్, 4 ఎల్ఎస్‌డీ బ్లాట్స్ స్వాధీనం



అరుణ ప్రభ శంషాబాద్ జోన్ శంషాబాద్ : మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ముఠాను ఆర్జీఐఏ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సంపత్‌నగర్ రోడ్డులోని హెచ్ఎండీఏ నర్సరీ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 80 గ్రాముల మెథాంఫెటమైన్, 4 ఎల్ఎస్‌డీ బ్లాట్స్, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో సయ్యద్ సయీద్ హుస్సేన్ అలియాస్ లంబా (38), మహమ్మద్ ఇమ్రాన్ అలియాస్ షకూర్ (32), రహ్మానుద్దీన్ అలియాస్ లాలా (29) ఉన్నారు. పోలీసుల దర్యాప్తులో బెంగళూరుకు చెందిన పెడ్లర్ జంషెడ్ నుంచి మత్తు పదార్థాలను తెప్పించి శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రధాన పెడ్లర్ జంషెడ్‌తో పాటు సబ్ పెడ్లర్ సయ్యద్ జోహైర్ మెహదీ పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. అరెస్టయిన లంబాపై 270కు పైగా చోరీ కేసులు ఉన్నట్లు, ఇమ్రాన్‌పై మూడు ఎన్‌డీపీఎస్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, నిల్వకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఏసీపీ వి. శ్రీకాంత్ గౌడ్ ప్రజలను కోరారు.

# సౌర విద్యుత్ ఏర్పాటుకు సువర్ణావకాశం

### 'సూర్య-సేతు'తో సబ్సిడీ, బ్యాంకు రుణాలపై అవగాహన

### అర్హులకు అక్కడికక్కడే నమోదు సౌకర్యం

### భద్రాచలం, మణుగూరులో ప్రత్యేక కార్యక్రమాలు

భద్రాచలం, అరుణప్రభ: గృహ విద్యుత్ వినియోగదారులు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, బ్యాంకు రుణ సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భద్రాచలం డివిజన్ పరిధిలో 'సూర్య--సేతు' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డివిజనల్ ఇంజినీర్ కె.జీవన్‌కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్--ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా అర్హులైన గృహ విద్యుత్ వినియోగదారులకు సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుపై ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం కింద ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.30 వేల వరకు, రెండు కిలోవాట్లకు రూ.60 వేల వరకు, మూడు కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78 వేల వరకు సబ్సిడీ అందుబాటులో ఉందని వివరించారు. సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుపై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, ఆర్థికంగా ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు బ్యాంకు రుణ సౌకర్యాల వివరాలను కూడా తెలియజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించిన విక్రేతలు, బ్యాంకుల లీడ్ మేనేజర్లు పాల్గొని సబ్సిడీ పొందే విధానం, బ్యాంకు రుణాలు, సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, ఇతర సాంకేతిక అంశాలపై వినియోగదారులకు వివరించనున్నారు. అర్హత కలిగిన గృహ విద్యుత్ వినియోగదారులకు అక్కడికక్కడే నమోదు చేసుకునే అవకాశం కూడా కల్పించనున్నట్లు జీవన్‌కుమార్ వెల్లడించారు. భద్రాచలం డివిజన్ కార్యాలయంలో మొదటి రెండు రోజులు, మణుగూరు సబ్‌స్టేషన్ ప్రాంగణంలో మూడో రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహ విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణహితమైన పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం టీజీఎన్‌పీడీసీఎల్ హెల్ప్‌లైన్ 1912 లేదా టీజీ రెడ్కో హెల్ప్‌డెస్క్ 6304903919ను సంప్రదించాలని సూచించారు.

# విశాఖలో అక్టోబర్ 2, 3 తేదీల్లో ఖాదీ సంత

**గాంధీ జయంతి సందర్భంగా స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహానికి ప్రత్యేక కార్యక్రమం**

**ప్రతి ఇంటా స్వదేశీ.. ఇంటింటా స్వదేశీ నినాదంతో ప్రజల్లో అవగాహన**

**రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ వైఖరి మారకుంటే కాంగ్రెస్ ముక్త్ భారత్: భాజపా నేత**



విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా విశాఖపట్నంలో అక్టోబర్ 2, 3 తేదీల్లో ఖాదీ సంత నిర్వహించనున్నట్లు భాజపా నాయకులు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శ్రీ కరక చెట్టు పోలమాంబ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఖాదీ సంత పోస్టర్‌ను విడుదల చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న స్వచ్ఛ భారత్ నిర్మాణం, గ్రామీణ చేతివృత్తులు, చేనేత కళల ప్రోత్సాహమే లక్ష్యంగా ఈ సంతను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించిన ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని నాయకులు పిలుపునిచ్చారు. స్వదేశీ వస్తువులను ఆదరించడం ద్వారా స్థానిక చేతివృత్తుల వారికి, చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. 'ప్రతి ఇంటా స్వదేశీ.. ఇంటింటా స్వదేశీ' అనే నినాదంతో ప్రజల్లో స్వదేశీ ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. స్వదేశీ ఉత్పత్తులను ఆదరిద్దాం.. స్వయం సమృద్ధి భారత్‌ను నిర్మిద్దాం అనే లక్ష్యంతో ఖాదీ సంతను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజకీయ అంశాలపైనా భాజపా నాయకులు స్పందించారు. ఇండియా కూటమి దేశవ్యాప్తంగా బలహీనపడుతోందని, రాజ్యాంగబద్ధమైన సంస్థలపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తూ ఇదే వైఖరిని కొనసాగిస్తే కాంగ్రెస్ ముక్త్ భారత్ సాకారమయ్యే రోజు దగ్గర్లోనే ఉందని వ్యాఖ్యానించారు. అంబేడ్కర్‌ను అవమానించిన పార్టీగా, అత్యవసర పరిస్థితి విధించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిన పార్టీగా కాంగ్రెస్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. దేశంలో ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. జీవీఎంసీ, మేయర్ ఎన్నికలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధానేశ్వరరావు, జిల్లా కార్యదర్శి లంకా శ్రీరామ్, భాజపా సీనియర్ నాయకుడు కొప్పల రామ్‌కుమార్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ టి.కోటేశ్వరరావు, సామాజిక మాధ్యమాల కన్వీనర్ జి.రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాఆరోగ్యసేవాసంస్థ (పిఏఎస్ఎస్) ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం




అరుణ ప్రభ:- బూర్గంపాడు మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజా ఆరోగ్య సేవా సంస్థ (పి ఏ ఎస్ ఎస్ ) ఆధ్వర్యంలో, మోక్షిత డెంటల్, డయాబెటిక్ అండ్ జనరల్ హాస్పిటల్, సారపాక మరియు పద్మావతి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, భద్రాచలం వారి సహకారంతో బుధవారం నాడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం పి ఏ ఎస్ ఎస్ వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులు డా. ఎస్ మురళి కృష్ణ ప్రారంభించారు, ఉచిత మెగా వైద్య శిబిరానికి బూర్గంపాడు మండలం ఎస్సై మేడ ప్రసాద్, సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నదారి రమేష్, మరియు బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు, మండల అధ్యక్షులు పూల పెల్లి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి, తమ అమూల్యమైన సందేశాన్ని అందించారు, ఈ సందర్భంగా ఎస్సై మెడ ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజా ఆరోగ్య సేవా సంస్థ (పి ఏ ఎస్ ఎస్), పద్మావతి మెడికల్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల కొరకు ఇటువంటి మెడికల్ క్యాంపులను నిర్వహిస్తూ వారి ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ వారికి కావలసిన వైద్య పరీక్షలను మరియు వారికి మందులను ఉచితముగా అందిస్తున్న మోక్షిత డయాబెటిక్ అండ్ డెంటల్ హాస్పిటల్ యజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ బూర్గంపాడు మండల ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు, సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, మండలంలో ఉన్న ప్రజల ఆరోగ్య సమస్యల పట్ల మరియు క్యాన్సర్ మహమ్మారి, వాటి లక్షణాలు గురించి కూడా ప్రజలలో పూర్తి స్థాయి అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులుగా చేయాలని కోరారు, ఇటువంటి మంచి కార్యక్రమాలు ప్రజా ఆరోగ్య సేవా సంస్థ ద్వారా మరిన్ని నిర్వహించి ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలియజేశారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజా ఆరోగ్య సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గల ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో ఇక్కడికి వచ్చానని, వారి ఆరోగ్య సమస్యల పట్ల పూర్తిస్థాయిలో సేవలను అందిస్తామని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఇటువంటి మెగా వైద్య శిబిరాలను నెలకు ఒకటి లేదా రెండు ఏర్పాటు చేసి పేద మరియు మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలను అందిస్తామని తెలియజేశారు, ఈ మెగా వైద్య శిబిరంలో దాదాపు 134 మందికి వైద్య సేవలు, అవసరతను బట్టి పరీక్షలు, చికిత్స మరియు వైద్య సలహాలు అందించడం జరిగిందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సారపాక మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కన్నదారి రమేష్, బూర్గంపాడు సర్పంచ్ మంద నాగరాజు, బూర్గంపాడు మండల అధ్యక్షులు పూల పెల్లి సుధాకర్ రెడ్డి, యడారి శివరామకృష్ణ, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అప్రమత్తతే రక్షణ - మహిళలు, బాలికల భద్రతకు అండగా షీ టీం

**వేధింపులు, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన**

**అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ మోసాలకు 1930**

**సమస్య ఎదురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి : షీ టీం ఎస్ఐ సునంద**



అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ నియోజకవర్గం కేసముద్రం పరిధిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్‌గ్రేడెడ్ స్కూల్ ఢ జూనియర్ కాలేజీలో మహిళలు, బాలికలు మరియు విద్యార్థినుల భద్రతపై మహబూబాబాద్ షీ టీం, కేసముద్రం పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్ఐ కుమారి సునంద మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్య అంశమని తెలిపారు. ఎలాంటి వేధింపులు లేదా సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను, షీ టీంను సంప్రదించాలని సూచించారు.

### వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

ఈవ్ టీజింగ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు వివరించారు.

### సైబర్ మోసాలపై జాగ్రత్త అవసరం

విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరం లేదా ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు అత్యవసర పరిస్థితుల్లో 112కు, మహిళలు లేదా బాలికలు వేధింపులకు గురైనప్పుడు షీ టీం నంబర్ 8712656935కు సంప్రదించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

### ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, చిన్న వయసులో ప్రలోభాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తు కోసం ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని ఎస్ఐ సునంద సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఓపికతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. ఏదైనా తప్పు నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టాలను గుర్తు చేసుకోవాలని, తల్లిదండ్రులను గౌరవిస్తూ వారి ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని సూచించారు.

### నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను దాచుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని, "ఏ సమస్య ఉన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయండి" అని షీ టీం ఎస్ఐ సునంద పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్‌గ్రేడెడ్ స్కూల్ ఢ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీమతి కె. సుజాత, అధ్యాపక బృందం, సుమారు 550 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. షీ టీం సిబ్బంది రమేష్, సుధారాణి, ప్రియాంక, కేసముద్రం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ధర్మానాయక్, ఉమెన్ కానిస్టేబుల్స్ అరుణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# తల్లీపిల్లలకు పౌష్టికాహార మందుల పంపిణీ

**రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ**




అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్. : మహబూబాబాద్ రోటరిక్లబ్ ఆధ్వర్యంలో తల్లీపిల్లలకు పౌష్టికాహార మందులను పౌడర్ డబ్బాలను అందజేశారు. అధ్యక్షులు దూదికట్ల సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి శంతన్ రామరాజు, డిస్ట్రిక్ట్ లీడర్ వద్దుల సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా దూదికట్ల సత్యం మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ సూచనల ప్రకారం ఈరోజు తల్లీ నవజాత శివుల సహాయార్థం ఈకార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. సమాజంలో ఎంతోమంది నిరుపేద మహిళలు సరైన పోషకహారం లేక పోవడంతో రోగాలబారిన పడుతున్నారని అన్నారు. నవజాత శిశువులు సైతం తమ ఎదుగుదలకు కావాల్సిన బలవర్ధకమైన ఆహారం అందక శారీరక ఆవలక్షణాలకు లోను కావడం, మృత్యువాత పడటం జరుగుతోందని తీవ్రఆవేదన వ్యక్తంచేశారు. ఈసామాజిక రుగ్మతను రూపు మాపేందుకు రోటరీక్లబ్ ఈ బృహత్తర ఆరోగ్య కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మందులు, ప్రోటీన్ పౌడర్ జార్లు, విటమిన్ మాత్రలు, పాల డబ్బాలు తదితర వాటిని అందజేశామన్నారు. వీటి ద్వారా తల్లీ పిల్లలు బలంతో పాటు రోగనిరోధక శక్తితో శారీరకంగా, మానసికంగా ఉంటారని అన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో పీజీ మెడికల్ ర్యాంకు సాధించిన మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఈగ శ్రీనివాస్ రమ్యల కుమార్తె కిరణ్మయిని ఘనంగా సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ముల్లంగి మోహన్ రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ వేమిశెట్టి కిషోర్ కుమార్, డిస్ట్రిక్ట్ లీడర్ బిక్కి వెంకటేశ్వర్లు, సాధు మహిపాల్ రెడ్డి, వల్లాల రమేష్, బోయినిపల్లి సతీష్ రావు, అచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# తాగి బండి నడిపితే జైలే.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే

**బూర్గంపాడులో**

**పోలీసుల స్పెషల్ డ్రైవ్ ఎస్‌హెచ్‌ఓ మేడ ప్రసాద్ హెచ్చరిక**

అరుణ ప్రభ:- బూర్గంపాడు మండల కేంద్రంలోని ప్రధాన అంబేద్కర్ కూడలిలో ( ఎస్ హెచ్ ఓ) మేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించడంతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా (ఎస్ హెచ్ ఓ) మేడ ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండలంలో వాహన తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# కల్యాణ లక్ష్మి ,షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే

సెప్టెంబర్ 30, అరుణ ప్రభ : ఉప్పల్ ఎమ్మార్వో కార్యాలయం లో ఉప్పల్ మండలానికి చెందిన 71 మందికి కల్యాణ లక్ష్మి మరియు షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయల తో తులం బంగారం ఇవ్వాలి అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కుటుంబానికి గ్రామ శాఖ అండ

**రూ.11,500 ఆర్థిక సాయం, బియ్యం అందజేత**

అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త సుదనబోయిన వెంకన్న మాతృమూర్తి వెంకటమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె మృతి పట్ల బేతోలు బిఆర్ఎస్ గ్రామ శాఖ తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. బుధవారం శోకసంద్రంలో ఉన్న వెంకటమ్మ కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బాసటగా నిలుస్తూ రూ.11,500/- నగదు ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్త కష్టాల్లో ఉన్నప్పుడు తోడుగా నిలవడం తమ బాధ్యత అని, మాతృవియోగంతో బాధపడుతున్న ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బిఆర్ఎస్ బేతోలు గ్రామ శాఖ స్థానిక నాయకులు షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్ సిరికొండ కృష్ణ ఏర్పుల హుస్సేన్ గద్దపాటి వేణు జిన్నుక ఎల్లయ్య తో పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలి



అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేసుకునే ప్రక్రియలో భాగంగా స్థానిక ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు టి. సంధ్యారాణి తమ ఎన్‌రోల్‌మెంట్ ఫారమ్‌లను పూర్తి చేశాము. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ మరియు నల్గొండ జిల్లాలకు చెందిన గ్రాడ్యుయేట్లందరూ కచ్చితంగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతున్నాము. గతంలో ఓటు వేసిన వారు కూడా ఇప్పుడు మళ్లీ కొత్తగా రిజిస్టర్ చేసుకోవాల్సిందే. కాబట్టి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో యాక్టివ్‌గా పాల్గొని, అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ నవంబర్ 6, 2026 లోపల కచ్చితంగా రిజిస్టర్ అయ్యేలా బాధ్యత తీసుకోవాలని పిలుపునిస్తున్నాము. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు సంధ్యారాణి అన్నారు

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# పట్టణ పారిశుధ్ధ్యంపై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి

### నూతన గ్రాస్ కటింగ్ మిషన్లను ప్రారంభించిన చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ నాయక్, కమిషనర్ వినోద్ కుమార్



అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ పట్టణంలోనీ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంలో భాగంగా నూతన గ్రాస్ కటింగ్ మిషన్లను మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ మున్సిపల్ కమిషనర్ ఎమ్ .వినోద్ కుమార్ ప్రారంభించారు. పట్టణంలోని రోడ్లు, ప్రధాన ప్రాంతాలు, పచ్చిక ప్రాంతాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించేలా పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో శానిటైజేషన్ మరియు పారిశుద్ధ్య పనులు నిత్యం కొనసాగాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు విధుల సమయంలో మద్యం సేవించి విధులకు హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి సిబ్బంది విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా మున్సిపల్ యూనిఫాం ధరించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు, అదేవిధంగా డ్రైవర్లు ఉద్దేశపూర్వకంగా కావాలని ట్రాక్టర్లను గాని ఆటోలు అనగానే డ్యామేజ్ చేస్తే మాత్రం ఖచ్చితంగా వారి పైన చర్యలు తీసుకుంటామని నడిపే వాహనాలను వారి యొక్క సొంత వాహనం లాగా చూసుకోవాలని ఇష్టానుసారంగా వాహనాలను నడపవద్దని ఏదైనా చిన్న చిన్న మైనర్ రిపేర్లు ఉంటే డ్రైవర్లే వాటిని చూసుకోవాలని కావాలని ఉద్దేశపూర్వకంగా మాత్రం ఈ యొక్క వాహనాలను రిపేరు వచ్చే విధంగా చేస్తే మాత్రం వారి పైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు అదేవిధంగా మున్సిపల్ విధుల్లో భాగంగా రోడ్లను శుభ్రం చేయాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది, ప్రైవేటు వ్యక్తుల స్థలాలు లేదా ఇళ్ల వద్ద వ్యక్తిగత పనులు చేస్తే సహించేది లేదని తెలిపారు. అలాంటి ఘటనలు తమ దృష్టికి వస్తే విచారణ అనంతరం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బందికి విధుల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చైర్‌పర్సన్ సూచించారు. సిబ్బందికి అవసరమైన సహకారం అందిస్తూ, పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పారిశుద్ధ్య వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ నాయక్ తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుశావలి, వెహికల్ ఇంచార్జ్ సత్య నారాయణ, సానిటరీ ఇన్స్పెక్టర్లు, శ్రీహరి, కరుణాకర్, జవాన్లు శ్రీను, కృష్ణ, చిరంజీవి, శ్రీను ,మధుసూదన్ , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# దాతల సహకారంతో విద్యార్థులకు టై, బెల్ట్,ఐడి కార్డు పంపిణి



అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ మండలం ఎంపి,యు,పి,ఎస్ బ్రాహ్మణపల్లి పాఠశాలలలో విద్యార్థులకు టై, బెల్ట్, ఐడి కార్డులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రు ఆధ్వర్యంలో పంపిణి చేశారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా, గ్రామ సర్పంచ్ ఎల్లేష్,మహబూబాబాద్ మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు,కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వీరయ్య హాజరయ్యారు, ఈ సందర్బంగా మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం కావాలంటే ప్రజాప్రతినిధులు, తల్లితండ్రులు, ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు, మహబూబాబాద్ జిల్లాలో బ్రహ్మణపల్లి ఎంపి,యు,పి,ఎస్ పాఠశాల మీగత పాఠశాలలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు, పాఠశాల ఉపాధ్యాయులు ఎంత ఆకుంటిత దీక్షతో పాఠశాల అభివృద్ధి కి పాల్పడుతున్నారో, విద్యార్థులు కూడా ఒక లక్ష్యం తో, ఇష్టం తో కష్టబడి చదివి పాఠశాలను ఫలితల్లో జిల్లాలో అగ్రగామిగా తీసుకురావాల్సిన బాధ్యత ఉందని అన్నారు, ఈ పాఠశాలలో చక్కటి ఆహ్లాధాకరమైన వాతావరణంలో విద్య ప్రమానలతో, నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందిస్తున్నారని అన్నారు, ఈ టై, బెల్ట్, ఐడి కార్డు లకు సహకరించిన ధాత బానోత్ రమేష్, సోనా, సావిత్రి ధంపతులను ఎమ్ ఈ ఓ, కాంప్లెక్స్ హెచ్ ఎమ్, వీరయ్య, సర్పంచ్ కోట ఎల్లేష్ ఉపాధ్యాయులు సన్మానించారు, అనంతరం పాఠశాల ప్రహరీ గోడ పెయింటింగ్, అభివృద్ధి కి సహకరించిన సర్పంచ్ కోట ఎల్లేష్ నవీన్, అఫ్రోజ్ లను సన్మానించారు, ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, మౌనిక, సూరప్రకాష్, పవన్ రాజ్, రాచకొండ ఉపేందర్, సూర్యతేజ, శంకర్, శృతి, శబాన,తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# బాలపాల లింగ్యా తండాలో పోలీసుల తనిఖీలు



### 20 వాహనాలు గుర్తింపు.. గుడుంబా, బెల్లం ఊట ధ్వంసం

### రూరల్ సిఐ అంజలి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు

అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కురవి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలపాల లింగ్యా తండాలో బుధవారం ఉదయం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుంచి 7:45 గంటల వరకు సుమారు 100 ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 వాహనాలను గుర్తించారు. అలాగే అక్రమంగా తయారు చేస్తున్న 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, సుమారు 1,000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై పోలీసులు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్‌కు చెందిన 26 మంది, స్పెషల్ పార్టీకి చెందిన 14 మంది కలిపి మొత్తం 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## షేక్ లియకత్ అలీకి ఘన సన్మానం

### 33 ఏళ్ల సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ



రంగారెడ్డి, సెప్టెంబర్ 30 (అరుణప్రభ): రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో క్లీనర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ లియకత్ అలీ 33 ఏళ్ల సుదీర్ఘ సేవల అనంతరం బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ కార్యాలయ అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ సహచరుల మన్ననలు పొందిన లియకత్ అలీ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి బాలేశ్వరి, ఏవీఎస్ ప్రసాద్, టైపిస్టు అనిత, కార్యాలయ ఉప పరిచారకుడు ఫకీర్ చంద్, ఇతర సిబ్బంది పాల్గొని లియకత్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.

# పిల్లల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరైన దిశలో ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత



### కరాటే పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు విఘ్నేష్‌ను అభినందించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : వరల్డ్ ఫునాకోషి షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముంబైలోని ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 37వ ఆల్ ఇండియా / ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మహబూబాబాద్ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధిలు నిర్వహిస్తున్న ఉన్న పోలీస్ కానిస్టేబుల్ సోమలింగయ్య కుమారుడు జి. విఘ్నేష్ యాదవ్ ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. అండర్-12 ఆరంజ్ బెల్ట్ విభాగంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలను (గోల్డ్ మెడల్స్ ) విఘ్నేష్ గెలుపొందాడు. ఈ సందర్భంగా సాధించిన విజయానికి గాను, జిల్లా పోలీస్ కార్యాలయంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, విఘ్నేష్ కు అభినందనలు తెలిపారు. చిన్న వయస్సులోనే జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు, పోలీస్ కుటుంబానికి మంచి పేరు తెచ్చాడని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో శ్రమించి మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని విఘ్నేష్‌ను ప్రోత్సహించారు. అలాగే, విధులు నిర్వహిస్తూనే కుమారుడిని క్రీడల్లో ఎంతో ప్రోత్సహిస్తున్న తండ్రి, కానిస్టేబుల్ సోమలింగయ్యను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరైన దిశలో ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.



## ఆంజనేయస్వామి ఆలయం వద్ద పులిహోర పంపిణి

### లక్ష్మీ శ్రీనివాస్ ( కోల్గూర్) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం మెతుకు లక్ష్మీ శ్రీనివాస్ ( కోల్గూర్) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ, అన్నదాన మహాదానమని ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి దేవదేవతల అనుగ్రహం ఉంటుందని అన్నారు, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల భద్రయ్య, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షులు గంగిశెట్టి వెంకటేశం, సీనియర్ నాయకులు , అత్తేల్లి లక్ష్మయ్య, శ్రీహరి, శంకరయ్య, సిరిపురం సత్యనారాయణ, కైలాస ప్రశాంత్, ఉమేష్, ప్రసాద్, గందే సంతోష్, వెంకటేశం,రాములు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు



## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

### గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవాలి

### పోషక మాసం సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో అవగాహన

గజ్వేల్ అరుణ ప్రభ : పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేయవచ్చని అంగన్వాడి సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లోని మూడవ అంగన్వాడి కేంద్రంలో పోషక మాసం సందర్భంగా మహిళలు, విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం కీలకమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోజువారీ ఆహారంలో పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పోషక విలువలు కలిగిన ఇతర ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. చిన్నారులకు సరైన సమయంలో పోషకాహారం అందించడం ద్వారా వారి ఎదుగుదలకు తోడ్పడవచ్చున్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహారంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని మహిళలు, విద్యార్థులకు సూచించారు. ప్రతి కుటుంబం పోషకాహార ప్రాధాన్యతను గుర్తించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని శ్రీలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రామలక్ష్మి, రజిత, ఫర్జానా, నాగరాణి, ఆశా వర్కర్లు మహిళలు పాల్గొన్నారు.



## అశ్విని హాస్పిటల్‌లో ఘనంగా వరల్డ్ హార్ట్ డే వేడుకలు

### ::: గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం వైద్యులు.

ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ : వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఎల్లారెడ్డిపేటలోని అశ్విని హాస్పిటల్‌లో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్విని హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి. సత్యనారాయణ స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అభినయ్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి వరల్డ్ హార్ట్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో అశ్విని హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం

గజ్వేల్ అరుణ ప్రభ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం పితృపక్షాల సందర్భాన్ని పురస్కరించుకొని, 2 వ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, అయ్యప్ప దేవాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ, అన్నదానం మహాదానమని, పితృపక్షాల సందర్భంగా ప్రతిరోజు అంగడిపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో భాగంగా కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, గోలి మమతా సంతోష్ వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# సిరిసిల్ల అభివృద్ధికి భారీగా నిధులు

## పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తూ ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పట్టణ మౌలిక వసతులు, విద్య, పరిపాలన, మహిళా సాధికారత, పోలీసు శాఖకు సంబంధించిన పలు ప్రాజెక్టులకు సీఎం శ్రీకారం చుట్టారు. సిరిసిల్లలో నేతన్న బజార్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. చేనేత కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు సిరిసిల్ల చేనేత ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం లభించేలా ఈ బజార్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల, వేములవాడలో కలిపి సుమారు రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పాఠశాలల నిర్మాణంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందుబాటులోకి రానున్నాయి. సిరిసిల్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఆధునిక విద్యా వసతులతో పాఠశాలలను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ నిర్మాణాన్ని చేపడుతున్నారు. పరిపాలనా సౌకర్యాల విస్తరణలో భాగంగా సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు రెవెన్యూ, పరిపాలనా సేవలు మరింత సౌకర్యవంతంగా అందనున్నాయి. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు వేదికగా నిలవడంతో పాటు మహిళల ఆర్థిక సాధికారతకు ఈ భవన్ దోహదపడనుంది. అదేవిధంగా పట్టణంలో పోలీసు శాఖ మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు సేవలు మరింత సమర్థవంతంగా అందే అవకాశం ఉంది. మొత్తంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేపట్టిన ఈ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి కొత్త ఊపు రానుంది. విద్య, చేనేత, పరిపాలన, మహిళా సాధికారత, పోలీసు మౌలిక వసతుల రంగాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టులు జిల్లాకు కీలకంగా నిలవనున్నాయి.

# అంగరంగ వైభవంగా శ్రీ విశ్వేశ్వర స్వామి, శ్రీ శివరామాలయ నూతన కమిటీల ప్రమాణ స్వీకారం

### ఆలయాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం: అరుణ ప్రభ దక్షిణ నియోజకవర్గం 31వ వార్డు పరిధిలో దసపల్లా సమీపంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం, అస్సాం గార్డెన్స్‌లోని శ్రీ శివరామాలయం నూతన చైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, జనసేన శ్రేణులు, ఆలయ భక్తులు, స్థానిక ప్రజలు, అభిమానుల సమక్షంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఆలయ పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సేవా దృక్పథంతో నిర్వర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సేవలో చురుగ్గా పాల్గొంటూ సామాజికంగా ముందుకు సాగేందుకు ఈ బాధ్యతలను ఒక మంచి అవకాశంగా భావించాలని అన్నారు. ఆలయాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయానంద రెడ్డి, అత్తిలి శంకర్రావు, ప్రకాశ్ రెడ్డి, కూటమి నాయకులు, జనసేన శ్రేణులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హక్కులపై అవగాహన అవసరం



చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ధర్మవరం ఆర్డీఓ ఓ. రామభూపాల్‌రెడ్డి అన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెలలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సమాజంలో వివక్షకు తావులేకుండా సమానత్వం, న్యాయం, గౌరవం ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి చట్టపరమైన పరిష్కారం పొందాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆర్డీఓ కార్యాలయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఎస్సై, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## రాజేష్ అఖిల దంపతుల ముద్దుల కుమార్తె శ్రీకర జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : సదాశివపేట పట్టణంలోని శ్రీ బంగారు మైసమ్మ ఫంక్షన్ హాల్‌లో ఎంపల్లి అఖిల రాజేష్ దంపతుల ముద్దుల కుమార్తె, లిటిల్ మాస్టర్ శ్రీకర మొదటి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారి శ్రీకరను ఆప్యాయంగా పలకరించి, కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారి శ్రీకర నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. చిన్నారి మొదటి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులకు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్‌లో సందడి వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు చిన్నారికి శుభాకాంక్షలు తెలుపుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ NSUI టౌన్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్, శేఖర్, జనార్దన్, సాతాని నరేందర్, రాగం అనిల్, మన్నె మనోహర్, శ్రీహరి, శరత్, సాయి, ఆకాష్, నాగరాజు, పవన్, మహేష్, అఖిల్, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు. చిన్నారి శ్రీకర భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



## చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ

ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): చెన్నేకొత్తపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ధర్మవరం ఆర్డీఓ ఓ. రామభూపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి రెవెన్యూ సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు, పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, ఆర్ఓఆర్, మ్యుటేషన్ వ్యవహారాలు, రీసర్వే పనులు, భూ సమస్యలపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు అందించాల్సిన రెవెన్యూ సేవలను నిర్ణీత గడువులోగా అందించాలని, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రీసర్వే పనులను వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆర్డీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆభరణాలు కడుగుతామని మోసం.. ఇద్దరు అరెస్ట్

### బంగారు చైన్‌ను యాసిడ్‌లో వేసి కరిగించే యత్నం.. అడ్డుకున్న మహిళ

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : బంగారు, వెండి ఆభరణాలను కడిగి శుభ్రం చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కపెల్లి గ్రామానికి చెందిన మందాటి కవిత, భర్త ప్రవీణ్ (26) ఇంటి వద్ద ఉండగా ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చారు. తాము బంగారు, వెండి ఆభరణాలను కడిగి తెల్లగా చేస్తామని చెప్పడంతో వారి మాటలను నమ్మిన కవిత తన బంగారు చైన్‌ను వారికి ఇచ్చింది. అయితే వారు ఆ చైన్‌ను యాసిడ్‌లో వేసి కరిగించే ప్రయత్నం చేయడంతో కవితకు అనుమానం వచ్చింది. ఎందుకు అలా చేస్తున్నారని ప్రశ్నించగా, నిందితులు యాసిడ్, ఇనుప రాడ్‌తో చంపుతామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో కవిత గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని ఇద్దరినీ పట్టుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బంగారు, వెండి ఆభరణాలను శుభ్రం చేస్తామని నమ్మించి ప్రజల నుంచి ఆభరణాలు తీసుకోవడం, అనంతరం వాటిని కరిగించి దొంగిలించడం లేదా బెదిరించి పారిపోవడానికి ప్రయత్నించడం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బీహార్‌కు చెందిన ఎండి. సత్తార్ అలీ (57), మొహమ్మద్ ఉస్మాన్ (39)లను అరెస్టు చేశారు. బంగారం కరిగించేందుకు ఉపయోగించిన యాసిడ్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

తెలియని వ్యక్తులు బంగారు, వెండి ఆభరణాలను కడుగుతామని, శుభ్రం చేస్తామని చెప్పినప్పుడు వారి మాటలను నమ్మి ఆభరణాలను అప్పగించవద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఇలాంటి ఘటనలు కనిపించిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.




## గర్భిణీ స్త్రీలు పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి సర్పంచ్ బొర్రా సుభద్ర

### మొరంపల్లి బంజరలో ఘనంగా 9వ పోషణ మాసం

### గర్భిణీలకు పండ్ల పంపిణీ.. పోషకాహారంపై అవగాహన

అరుణ ప్రభ:- గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ బొర్రా సుభద్ర అన్నారు.మండల పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు పండ్లను పంపిణీ చేసి, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ బొర్ర సుభద్ర, సిడిపిఓలు అతిథులుగా హాజరయ్యారు .ఈ సందర్భంగా సర్పంచ్ బొర్రా సుభద్ర మాట్లాడుతూ గర్భిణీల ఆరోగ్య పరిస్థితులు, పోషకాహారం, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే ఆహారం తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని, అందువల్ల పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ఎంతో ముఖ్యమని వివరించారు. గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భధారణ సమయంలో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ, సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని గర్భిణీలకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పోషణ మాసం కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన తల్లి ద్వారానే ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తాడని, చిన్నారుల ఎదుగుదలకు సరైన పోషకాహారం కీలకమని వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, ఐటీసీ అనుబంధ సంస్థ ప్రతినిధులు, మహిళలు, గర్భిణీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## రామాలయంలో భక్తిశ్రద్ధలతో గణనాథుడికి లక్ష గరిక పూజ

అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ గణపతి ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక రామ మందిరంలో ప్రత్యేక పూజలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళి నాయక్ మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ రామ మందిరంలో బుధవారం సంకటహర చతుర్దశి సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక లక్ష గరిక పూజ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా జరిగాయి . ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళి నాయక్ పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు సాదరంగా స్వాగతం పలికి, వేద ఆశీర్వచనాలతో స్వామివారి తీర్థప్రసాదాలు మరియు శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం మందిర పరిసరాల్లో ఉన్న భక్తులు, స్థానిక ప్రజలతో డాక్టర్ ఉమా మురళి నాయక్ ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూ వారి కుశల ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. బాధ్యతగల నాయకురాలిగా ఉంటూనే, సామాన్యులలో ఒకరిగా కలిసిపోయి భక్తులతో ఎంతో ఆత్మీయంగా మెలిగిన డాక్టర్ ఉమా మురళి నాయక్ వినయపూర్వక వైఖరిని ఆలయానికి వచ్చిన భక్తులు విశేషంగా ప్రశంసించారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆ దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు

### 4 ద్విచక్ర వాహనాలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం

### రూ.2.50 లక్షల విలువైన ఆస్తి పట్టివేత



బోడుప్పల్, సెప్టెంబర్ 30 (అరుణప్రభ): చెంగిచెర్ల ప్రాంతంలో జరిగిన దొంగతనాల కేసులకు సంబంధించి మేడిపల్లి పోలీసులు బబ్లు పాశ్వాన్ (45)ను అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 2.50 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. మేడిపల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి చెంగిచెర్లలో చోటుచేసుకున్న దొంగతనాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నేరాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్న బబ్లు పాశ్వాన్‌ను గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడు ప్రస్తుతం చింతల్‌లోని గణేశ్ నగర్, షా సినిమా థియేటర్ వెనుక నివాసం ఉంటున్నట్లు, అతడి స్వస్థలం జార్ఖండ్‌లోని గిరిడిహ్ జిల్లా దావథాన్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అతడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# పీఎం శ్రీ పాఠశాలల జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్

అరుణప్రభ 30 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా ఐడీఓసీ వేదికగా పీఎం శ్రీ పాఠశాలల జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించడం, సభా నిర్వహణ, చర్చ, ప్రశ్నించడం, సమాధానం ఇవ్వడం వంటి ప్రజాస్వామ్య విలువలను ఆచరణాత్మకంగా నేర్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో జిల్లాలోని (21) పాఠశాలలు పీఎం శ్రీ, మోడల్ స్కూల్స్, నుండి (79) మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. మొట్టమొదటిసారిగా ఈ మాకు పార్లమెంటును జిల్లాలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరిష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ పిల్లల్లో జాతీయ ఐక్యమత్యం పెంపొందించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయం అని, తాను కూడా గ్రాడ్యుయేషన్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో ఈ మాక్ పార్లమెంటులో పాల్గొనడం జరిగిందని గుర్తుకు చేసుకున్నారు. మరింత ఉత్సాహంతో ఈ మాక్ పార్లమెంటులో ప్రతిపక్ష, స్వపక్ష నాయకులు అడిగే ప్రశ్నోత్తరాలు, సమాధానాలు చాలా బాగుంటాయని, ప్రత్యక్ష ప్రసార ల ద్వారా పార్లమెంట్ ప్రోసిడింగ్సు చూస్తే అందరికీ అర్థమవుతుందన్నారు. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు సభ్యుల్లో రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమానికి పంపడం జరుగుతుందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. చక్కటి ఇంగ్లీష్ , విషయ పరిజ్ఞానంతో పాల్గొన్న విద్యార్థినీ,విద్యార్థులు భవిష్యత్తులో మరింత క్లుప్తంగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డి ఇ ఓ శ్రీరాములు, డి ఎస్ ఓ అప్పారావు, ఏ ఎమ్ ఓ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. మాక్ పార్లమెంట్



కార్యక్రమానికి కన్వీనర్ ఉపేందర్ రావు, ఆర్గనైజర్ అంజన్ సుల్తానా వ్యవహరించనున్నారు. జిల్లా సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్షులు ఏ. బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గైడ్ టీచర్లు మరియు విద్యార్థుల సహకారంతో నిర్వహించడం జరిగిందన్నారు, విద్యార్థులు పార్లమెంట్ సభ్యుల పాత్రలను పోషిస్తూ సమకాలీన అంశాలపై చర్చలు, ప్రశ్నోత్తరాలు, ప్రజా సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు, ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, చర్చా నైపుణ్యాలు, బాధ్యతాయుత పౌరసత్వ భావన పెంపొందించడానికి దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు

# 4న ఉచిత కంటి వైద్య శిబిరం



ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అక్టోబరు 4న ఉచిత ఐఓఎల్ కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, కార్యదర్శి ఆర్. జయరాం తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పాఠశాలలో జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం స్వాతి క్లినిక్‌లో శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. యువర్స్ ఫౌండేషన్, శ్రీ సత్యసాయి జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరుకు చెందిన నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన నేత్ర వైద్యులతో పరీక్షలు, చికిత్స అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్, రవాణా, వసతి, కళ్లద్దాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి వంకదారి రామచంద్రగుప్త కుటుంబం, డాక్టర్ బి.వి. సుబ్బారావు కుటుంబం, బండ్లపల్లి రంగనాథం కుటుంబం దాతలుగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకట నాగార్జున, పీఆర్ఓ రాధాకృష్ణ, వై.కె. శ్రీనివాసులు, కృష్ణమూర్తి, మాజీ కౌన్సిలర్ కేత లోకేష్, దేవతా సుబ్రహ్మణ్యం, పోల ప్రభాకర్, చాంద్‌బాషా, వెంకట సుకుమార్, డాక్టర్ బి.వి. సుబ్బారావు, సికిందర్, మోహన్, వాసుదేవ్, గర్రె రమేష్‌బాబు, రామచంద్రగుప్త, బండ్లపల్లి రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే పనులను వేగవంతం చేయాలి



ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం మండలంలో కొనసాగుతున్న రీసర్వే పనులను ఆర్డీఓ ఓ. రామభూపాల్‌రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కునుతూరు, మల్లకల్వ, రేగాటిపల్లి, ఏలుకుంట్ల గ్రామాల్లో పనుల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాయింట్ ఎల్‌పీఎంల విభజన, భూ వివరాల పరిశీలన, రికార్డుల అనుసంధానంపై సర్వే సిబ్బందితో చర్చించారు. జాయింట్ ఎల్‌పీఎంలను పట్టాదారుల వారీగా నిబంధనల ప్రకారం ఖచ్చితంగా విభజించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పట్టాదారులతో సమన్వయం చేసుకుని వారి అభ్యంతరాలు, సందేహాలను పరిష్కరించాలని, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు రైతులు, భూ యజమానులు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్, సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి పరీక్షలు

ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని 42వ వార్డు రాజేంద్రనగర్ లో గొడుగు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచిత సామాజిక వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ ముస్లిం మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్ హుస్సేన్, 42వ వార్డు ఇంఛార్జ్ ముత్తుకూరు బీబీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 100 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఫిజియోథెరపీ సేవలతో పాటు ఐ. ఎఫ్. టీ చికిత్స అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొడుగు నాగరాజు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు నాగూర్ ఉమర్ (స్టాలిన్), అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. నాగేంద్రప్రసాద్, డాక్టర్. సురేందర్, ఆశా కార్యకర్తలు అరుణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



## చెట్టుపై పిడుగు.. 25 పొట్టేలు పిల్లలు మృతి

ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం మండలం మల్కాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు 25 పొట్టేలు పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బిళ్లే విజయ్‌కుమార్ పొట్టేలు పిల్లలను మేపేందుకు గ్రామ సమీపంలోని ఓ చెట్టు కింద కంచె ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయంలో పొట్టేలు పిల్లలు చెట్టు కింద ఉన్నప్పుడు ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు కింద ఉన్న 25 పొట్టేలు పిల్లలు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనతో యజమాని విజయ్‌కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన పొట్టేలు పిల్లల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. పిడుగుపాటు ఘటనతో తాను తీవ్రంగా నష్టపోయానని, అధికారులు పరిశీలించి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించాలని కోరారు.




## మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలి

ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ అమలు చేసి జీతాలు పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు బుధవారం ధర్మవరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పీఆర్సీ వేతనాలతో పాటు డీఏ, మధ్యంతర భృతి కల్పించాలని కోరారు. 2013లో జారీ చేసిన జీఓ ఆర్‌టీ నెం.1615ను అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు సమాన వేతనాలు, డ్రైవర్లకు రూ.24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అయూబ్‌ఖాన్, ఎస్. వెంకటేష్, మేకలబాబు, బి. నాగరాజు, ఎం. నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులో ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేయించుకోవాలి



ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ దేవరాజు సూచించారు. పూర్తిచేయని వారు సంబంధిత రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పోస్ యంత్రం ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ధర్మవరం మండలంలో 1,64,896 యూనిట్లకు గాను 1,56,414 ఈ-కేవైసీలు పూర్తయ్యాయి. ఐదేళ్లలోపు వయస్సు కారణంగా 4,352 మందికి మినహాయింపు ఉంది. ఇంకా 4,130 మంది ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. అదేవిధంగా ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను ఈ-పోస్‌లో నమోదు లేదా నవీకరించుకోవాలని సూచించారు. మొత్తం 54,689 మందికి మొబైల్ నంబర్ అవసరం కాగా, 23,964 మందికి ప్రక్రియ పూర్తైంది. మరో 30,725 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణరెడ్డి, ఆర్డీఓ రామభూపాల్‌రెడ్డి సూచనల మేరకు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. రేషన్ డీలర్ల ద్వారా పురోగతిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

## జర్నలిస్టులపై దాడులపై ఉన్నతస్థాయి కమిటీ

### కమిటీ పునరుద్ధరణ.. రెండేళ్లపాటు కొనసాగింపు

అమరావతి, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): జర్నలిస్టులపై జరిగే దాడులు, దౌర్జన్యాల కేసులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీని ఏపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ రెండేళ్లపాటు కొనసాగనుంది. హోంమంత్రి చైర్మన్‌గా, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా ఉంటారు. హోంశాఖ, సాధారణ పరిపాలన శాఖల ఉన్నతాధికారులు, ఐజీపీ (లా అండ్ ఆర్డర్), గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలు, పెద్ద దినపత్రికలు, చిన్న--మధ్య తరహా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటోగ్రాఫర్ల సంఘాల ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. సమాచార--పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి మరో సభ్యుడిని చేర్చుకునే అధికారం ఆయనకు కల్పించారు. జర్నలిస్టులపై జరిగే దాడులు, దౌర్జన్యాల కేసులను పరిశీలించి, సంబంధిత అంశాల్లో తదుపరి చర్యలకు ఈ కమిటీ దోహదపడనుంది.



## సీఎం జిల్లా పర్యటన విజయవంతం..

### పోలీసు సిబ్బందికి ఎస్పీ మహేష్ బి. గితే అభినందనలు.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన బుధవారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయవంతంగా ముగిసింది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు చేపట్టిన పటిష్ట భద్రతా ఏర్పాట్లు, సమన్వయంతో బందోబస్తు విధుల నిర్వహణతో పర్యటన ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. పర్యటన మొత్తం అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ, సమన్వయంతో పనిచేసిన ప్రతి ఒక్కరినీ హృదయపూర్వకంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బంది సేవలను ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే సేవా స్ఫూర్తి, అంకితభావం, సమన్వయంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు.ద

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా వికాసం

### 30 కేంద్రాల్లో 843 మందికి ఉచిత విద్యా సహాయం

ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో 'విద్యా వికాసం--విద్యా వాహిని' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు తెలిపారు. ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌స్ట్రీట్ ప్రాంతంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న భగత్‌సింగ్, అల్లూరి విద్యా వికాసం కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన విధానం, విద్యా కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో సంస్కృతి సేవా సమితి సహకారంతో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హరీష్‌బాబు తెలిపారు. ధర్మవరం అర్బన్, రూరల్‌తో పాటు బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 30 ఉచిత విద్యా వికాసం కేంద్రాలను ఏర్పాటు చేసి, 30 మంది స్థానిక ట్యూటర్ల ద్వారా 843 మంది విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని 40 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 'విద్యా వాహిని' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించడం, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రోత్సహించడం కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నారు.



## అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సన్మానం

ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషణ కోసం క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయమని మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు అన్నారు. బుధవారం ధర్మవరం శాంతినగర్‌లోని కేవీఎస్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో అంగన్‌వాడీ ఉత్సవం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హరీష్‌బాబు హాజరై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లను శాలువాలతో సన్మానించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ పోషణ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదల, పోషకాహారం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారు వారధిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జగ్గా నాగరత్నమ్మ, ఉపాధ్యక్షురాలు పోరాళ్ల మహాలక్ష్మి, నాయకులు నాగులయ్య, మారుతి, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నమ్మ, సుభద్ర, లలితమ్మ, ఆయాలు గంగమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.




## కంప్యూటర్ పరిజ్ఞానంతో భవిష్యత్ అవకాశాలు

ధర్మవరం, సెప్టెంబరు 30; (అరుణ ప్రభ న్యూస్): కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థులకు భవిష్యత్తులో అనేక అవకాశాలను అందిస్తుందని ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మశ్రీ తెలిపారు. ధర్మవరం మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 9, 10 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వృత్తి విద్యా విద్యార్థులు బుధవారం పట్టణంలోని గురు రాఘవేంద్ర కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్, ఎంకేఎస్ సిల్క్ రీల్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంప్యూటర్ వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం, పట్టు ఉత్పత్తి ప్రక్రియపై అవగాహన కల్పించారు. వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వృత్తి విద్యా ఉపాధ్యాయుడు ఎస్.వి. రంగనాథ తెలిపారు. పట్టు ఉత్పత్తిలో శిక్షణ పొందితే ఉపాధి అవకాశాలను త్వరగా అందిపుచ్చుకోవచ్చని వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు జి. చైతన్యలక్ష్మి పేర్కొన్నారు.

# ఫ్యూచర్‌సిటీ రద్దు చేస్తామనేవాడికి అడ్రస్ ఉండదు

## 14ఏళ్లు నాశనం చేసినోడు మళ్లీ మాట్లాడమా...?
## రాష్ట్రంలో యాచారం మండలానికే భారీగా నిధులు...
## అభివృద్ధితో ఇక్కడి గ్రామాల రూపురేఖలన్నీ మార్చేస్తాం...
## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి...
## పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం...



ఎంతో దూరదృష్టితో హైదరాబాద్‌కు ధీటైన నగరాన్ని నిర్మిస్తుంటే... దాన్ని రద్దుచేసి, మళ్లీ ఫార్మా తెస్తామని కొందరు మాట్లాడుతున్నారని... ముందు వారి పార్టీకే అడ్రస్ ఉండదని ఇబ్రహీంపట్నం మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. ఫార్మా పేరుతో భూదందా, పరిహారం కాజేయటం తప్పిస్తే... యాచారం మండలానికి బీఆర్ఎస్ నాయకులు చేసిందేంలేదన్నారు. బుధవారం మధ్యాహ్నం మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం అనంతరం, మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. యాచారం, మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, ధర్మన్నగూడ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే... సీసీరోడ్లు, డ్రైనేజీ, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తమ గ్రామాల్లో ప్రగతిబాటలు వేసేందుకు వచ్చిన మల్‌రెడ్డికి యాచారం, మొండిగౌరెల్లి గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కొత్తపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే... అభివృద్ధికి ఆమడదూరంలో ఆగిపోయిన గ్రామం రూపురేఖలు ఇక మారనున్నాయని తెలిపారు. ఏళ్లతరబడిగా పేరుకుపోయిన సమస్యలన్నింటికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. భూసేకరణలో నష్టపోయిన ప్రతీరైతుకు అండగా ఉంటామన్న మల్‌రెడ్డి... అసైన్డ్‌రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందిస్తామన్నారు. దశాబ్దాలుగా ధర్మన్నగూడ గ్రామానికి రోడ్డులేక అవస్థలకు గురవుతున్నామని... బీఆర్ఎస్ నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, పదేళ్లలో ప్రయోజనంలేకపోయిందని గ్రామస్థులు ఎమ్మెల్యే ముందు వాపోయారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే... త్వరలోనే రోడ్డు నిర్మాణం జరుగుతుందని హామీ ఇచ్చారు.

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

## 100 శాతం చెత్త సేకరణపై కఠిన పర్యవేక్షణకు నిర్ణయం
## చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, కమిషనర్ పి. గణేష్ రెడ్డి



గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్-ప్రజ్ఞాపూర్: స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ అధ్యక్షతన, కమిషనర్ పి. గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టణ అభివృద్ధి, ప్రజా సౌకర్యాలపై చర్చించి పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజూ క్రమం తప్పకుండా అన్ని వార్డుల్లో పర్యటించేలా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని చర్చించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాహ్య మూల్యాంకనాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

## టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్



గజ్వేల్ అరుణ ప్రభ : ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహించే సమ్మేటివ్-1, సమ్మేటివ్-2 పరీక్షలకు బాహ్య మూల్యాంకన విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. పాఠశాలల సందర్శన, సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ మండల అధ్యక్షుడు తాళ్ల నాగరాజు ఆధ్వర్యంలో ముట్రాజ్‌పల్లి, ఆర్అండ్ఆర్ కాలనీ-1, ఆర్అండ్ఆర్ కాలనీ-2, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్అండ్ఆర్ కాలనీ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల గజ్వేల్, ప్రజ్ఞాపూర్, కొడకండ్ల, రిమ్మనగూడ, దాతర్‌పల్లి, అక్కారం, కోనాపూర్, శ్రీగిరిపల్లి తదితర పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంచు నరేందర్ మాట్లాడుతూ గతంలో ఏడో తరగతికి జిల్లా బోర్డు పరీక్షలు నిర్వహించి, అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులను పై తరగతికి పంపేవారని తెలిపారు. ప్రస్తుతం ఆ విధానం రద్దు కావడంతో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినప్పటికీ పరీక్ష ఫలితాలు, మార్కులు, ర్యాంకులు, ఉత్తీర్ణత వంటి అంశాలతో సంబంధం లేకుండా పై తరగతులకు ప్రమోట్ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకనం ఆధారంగా బోధనా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బాహ్య మూల్యాంకనం నిర్వహించడం ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉంటుందని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు పాపగారి పాపిరెడ్డి, జోన్ కన్వీనర్ జల్లెల శ్రీనివాస్, గజ్వేల్ మండల అధ్యక్షుడు తాళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గోక విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్)ను రద్దు చేసి, వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ దమ్మని మల్లయ్య, పంబాల ఎల్లయ్య, జగదేవ్‌పూర్ మండల నాయకులు సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఎన్నికలకు సిద్ధం కావాలి

మహేశ్వరం నియోజకవర్గ బడంగ్పేట్ సర్కిల్ ( అరుణ ప్రభ న్యూస్ 30) : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని లిబిమహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి లి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించాలని కార్యకర్తలకు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడ సామ యాదిరెడ్డి గార్డెన్స్‌లో మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి, అర్హత ఉన్న వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలందరి సహాయ సహకారాలు, కృషితో సురభి వాణీదేవినీ గెలిపించుకోవడం జరిగిందని గుర్తుచేశారు. అదే పోరాట స్ఫూర్తితో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. అభ్యర్థి ఎవరైనా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మహేశ్వరం నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో అభివృద్ధి పనులకు రూ.14.80 లక్షలు

## త్వరలో డ్రైనేజీ మరమ్మతులు, సీసీ రోడ్డు పునర్నిర్మాణం
## నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తాం: నవారు మల్లారెడ్డి

అల్మాస్‌గూడ, అరుణప్రభ: నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో వివిధ అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ సాధారణ నిధుల నుంచి రూ.14.80 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తికావడంతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి కాలనీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.ఎల్.ఎన్.రెడ్డి, ఇతర కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు గురువారం కాలనీలో పర్యటించారు. ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని రోడ్డు నంబరు 5లో దెబ్బతిన్న భూగర్భ మురుగునీటి వ్యవస్థకు మరమ్మతులు చేపట్టనున్నారు. రోడ్డు నంబరు 10లో సీసీ రహదారిని పునర్నిర్మించేందుకు నిధులు కేటాయించారు. గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్యతో పాటు సీసీ రోడ్డు నిర్మాణంలో సరైన లెవలింగ్ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడి, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయిస్తామని నవారు మల్లారెడ్డి హామీ ఇచ్చారు. కాలనీలో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, ఇతర కాలనీ వాసులు మాట్లాడుతూ గత ఐదారు సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్ల నిర్మాణంలో లోపాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి స్పందించి అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసినందుకు నవారు మల్లారెడ్డి, శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అనిల్, శ్రీకాంత్, శ్రవణ్‌కుమార్, రవికుమార్, నరేష్, కార్తీక్, శరత్, వెంకన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# కనకదుర్గ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

కనకదుర్గ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

వనస్థలిపురం, అరుణ ప్రభ.సెప్టెంబర్ 30: ప్రశాంత్‌నగర్‌లోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గ దేవి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొని కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



# మృతుని కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించిన గ్రామ యువకులు

గజ్వేల్ అరుణ ప్రభ : జగదేవపూర్: మండలంలోని పలుగుగడ్డ గ్రామానికి చెందిన లోకుల సాయిరాం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ యువకులు మానవత్వాన్ని చాటుకుంటూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలనే ఉద్దేశంతో గ్రామ యువకులంతా కలిసి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని సేకరించారు. సేకరించిన మొత్తాన్ని ఈరోజు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కష్టకాలంలో తమకు అండగా నిలిచిన గ్రామ యువకులకు మృతుని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. యువకులు చూపిన చొరవను, సేవా గుణాన్ని గ్రామస్తులు, పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు లింగాల అనిల్, నర్ర శ్రీకాంత్, లింగాల నితిన్, చెక్కల కృష్ణ, లింగాల కృష్ణ, అరుముల్ల స్వామి, అరుముల్ల ప్రవీణ్, గుర్జకుంట సుదర్శన్, నర్ర గణేష్, దేవుని గణేష్, నర్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామ బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్ అరుణ ప్రభ : జగదేవపూర్: అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న యువ రైతు లోకుల సాయిరాం కుటుంబానికి గ్రామ బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు. జగదేవపూర్ మండలంలోని పలుగుగడ్డ గ్రామానికి చెందిన లోకుల సాయిరాం అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పిట్టల అంజయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున మానవతా దృక్పథంతో తక్షణ సహాయంగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు పిట్టల అంజయ్య మాట్లాడుతూ యువ రైతు మృతి అత్యంత విచారకరమన్నారు. భవిష్యత్తులోనూ బాధిత కుటుంబానికి పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజేశ్వరి రవి, బీఆర్ఎస్ నాయకులు నర్ర పెద్ద కనకయ్య, గువ్వ రమేష్, సుధాకర్, లక్ష్మణ్, ప్రవీణ్, కృష్ణ, నర్సింలు, కనకయ్య, స్వామి, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట విజ్ఞాన్ స్కూల్‌లో రెడ్‌క్రాస్ డైరెక్టర్ల ఎన్నికలపై అవగాహన

## : ముఖ్య అతిథిగా డాక్టర్ వంగపెల్లి అంజయ్య స్వామి,

గజ్వేల్ అరుణ ప్రభ : యాదగిరిగుట్టలోని విజ్ఞాన్ స్కూల్‌లో శ్రీ సద్ది వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ డైరెక్టర్ల ఎన్నికలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు, డైరెక్టర్ల ఎన్నికల విధానం, ఎన్నికల్లో సభ్యుల భాగస్వామ్యం తదితర అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. సమాజ సేవలో రెడ్‌క్రాస్ సంస్థ పోషిస్తున్న పాత్రను వివరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతంగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంగపెల్లి అంజయ్య స్వామి, మాజీ యాదగిరిగుట్ట పీఎస్‌సీ చైర్మన్ ఇమ్మడి రామచంద్రరెడ్డి పాల్గొన్నారు. అలాగే పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు, నాయకులు, నిర్వాహకులు, సంబంధిత ప్రతినిధులు పాల్గొన్నారు.

# రక్తదానం దైవ కార్యంతో సమానం!

**(01 అక్టోబర్ : జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం" సందర్భంగా)**

కృత్రిమంగా ప్రయోగశాలలో యతయారు చేయలేని అమూల్య జీవన పదార్థం రక్తం. రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. రక్త విధులకు సత్సమానం లేదు. అనుక్షణం జీవ కణజాలానికి అవసరమైన ఆక్సీజన్‌ను ఒసరఫరా చేస్తూ, వ్యర్థ పదార్థాలను విసర్జించే అమూల్య విధులను నిర్వహిస్తున్న రక్తం జీవితాలకే ఆధారం అవుతున్నది. ఒక వ్యక్తి ప్రమాదాలు, తీవ్ర వ్యాధులు, ప్రసవాలు, రక్తహీనత కలిగిన వ్యక్తులు, ఎముకల మజ్జ లోపాలు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర సందర్భాల్లో రక్తం అందించాల్సి వచ్చినపుడు ఏమీ ఆశించకుండా స్వచ్ఛందం రక్త దాతలు దేవుళ్ల రూపంలో కలిపిస్తారు. రక్తం దానం చేయడంతో ప్రాణాలు నిలబడతాయి, కుటుంబాలు నిలుస్తాయి. సమయానికి రోగికి సురక్షిత రక్త దాత భగవంతుడి ప్రతిరూపంగా దొరకడం ఓ అదృష్టం. రక్తం దొరక్క ప్రాణం పోవడం పౌర సమాజానికి అవమానకరం, ఆక్షేపణీయం. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల రోగులు రక్త దాతల అమూల్య సేవలతో ప్రాణాలను నిలుపుకుంటున్నారు.

**ఐక్యతతో రక్తదానం - ప్రాణదాన నినాదం :**

ప్రాణ దాతలుగా విశేష కృషి చేస్తున్న స్వచ్ఛంద రక్త దాతలకు కృతజ్ఞతలు సమర్పించడం, నూతన రక్త దాతలను ప్రోత్సహించడం, రక్తదానం పట్ల అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలను జాతీయ స్థాయిలో నిర్వహించడానికి డాక్టర్ జోలి, స్వరూప కిషన్ చొరవతో ప్రతి ఏట 01 అక్టోబర్ రోజున దేశవ్యాప్తంగా "జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం (నేషనల్ వాలంటరీ బ్లడ్ డోనేషన్ డే)" నిర్వహించడం జరుగుతోంది. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా 14 జూన్ రోజున కూడా "ప్రపంచ రక్త దాతల దినోత్సవం" జరుపుకోవడం కూడా ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినం ఇతివృత్తంగా "మానవత్వంతో ఒక చుక్క : ప్రాణ దానం చేద్దాం, ప్రాణాలు నిలుపుదాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతుంది. జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినం వేదికగా రక్త దాన శిబిరాల నిర్వహణ, రక్త దాతల నిస్వార్థ సేవలను గుర్తించడం, విద్యాలయాల్లో సెమినార్లు లేదా కార్యశాలలు, అవగాహన ర్యాలీలు, సెలబ్రిటీలతో ప్రచారాలు, వీధి నాటికలు, ఫ్లాష్ మాబ్స్, సామాజిక మాధ్యమ ప్రచారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వాలు/ఎన్‌జీఓలు/పౌర సమాజం/అంతర్జాతీయ సంస్థల సమన్వయం లాంటి అంశాలను నిర్వహించాలి లేదా అవగాహన పరచాలి.

**ఎవరు, ఎప్పుడు రక్త దానం చేయవచ్చు :**

రక్తం, ప్లేట్‌లెట్స్ లాంటి ఇతర రక్త ఉత్పత్తుల దాతల కొరత భారత్‌ను పట్టి పీడిస్తున్నది. యువ జనాభా అధికంగా ఉన్న దేశంలో రక్త కొరత ఏర్పడడం సోచనీయం. 18 నుంచి 65 ఏండ్ల వయస్సు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఎప్పుడైనా రక్తదానం చేయవచ్చు. ప్రతి 3 నెలలకు ఒకసారి పురుషులు, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మహిళలు రక్తదానం చేయవచ్చు. రక్తదాత శరీర బరువు 45 కెజీలకు మించి ఉండాలి. రక్తంలో కనీస హిమోగ్లోబిన్ 12.5 గ్రా/డిఎల్ ఉండాలి. రక్తదానం వల్ల దాతకు పలు ప్రయోజనాలు కలుగుతాయి. దాత శరీరంలో రక్త రాళ్లు (బ్లడ్ స్టోన్స్) ఏర్పడకుండా అడ్డుకోవడం, దాత ఆరోగ్యానికి ఊతం లభించడం, దాత మానసిక సంతృప్తి పెరగడం, ప్రాణ దానం చేశాననే భావనతో సంతృప్తి లభించడం, గుండె ఆరోగ్యం మెరుగుపడడం, నూతన రక్త కణాలు ఉత్పత్తి కావడం లాంటి ప్రయోజనాలు రక్త దాతలకు కలుగుతాయి.

**యువభారతంలో రక్త దాతల కొరత :**

ప్రపంచవ్యాప్తంగా సాలీనా దాదాపు 120 మిలియన్ల రక్తదానాలు, భారత్‌లో 11.45 మిలియన్ల రక్త దానాలు జరుగుతున్నాయని తెలుస్తున్నది. భారత్‌లో 13 మిలియన్ల రక్త దానాల అవసరం ఉంది. అనగా, మన భారత్‌లో 12 లక్షల యూనిట్ల రక్త కొరత ఉన్నది. ప్రపంవ్యాప్తంగా 170 దేశాల్లో 12,700 బ్లడ్ బ్యాంకులు పని చేస్తున్నాయి. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి 1000 మందిలో 33 రక్తదానం చేస్తుండగా, భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నలుగురు మాత్రమే రక్త దానానికి ముందుకు వస్తున్నారు. ప్రభుత్వాలు, బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవకులు, ఉన్నత విద్యా సంస్థలు కలిసి ప్రపంచ రక్త దాతల దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ అవగాహన కల్పించాలి. ఢిల్లీ లాంటి నగరాల్లో అవసరం కన్న అధికంగా రక్త దాతలు, బీహార్ లాంటి రాష్ట్రాల్లో రక్తదాతల తీవ్ర కొరత కనిపిస్తున్నాయి. రక్త దానంతో పాటు అవయవ దానాలు, పార్థివ గేహ దానాలను కూడా ప్రోత్సహించాలి, కొన ఊపిరితో ఉన్న అభాగ్యుల శ్వాసను నిలపాలి.

ప్రతి యువకుడు సాలీనా కనీసం 2 లేదా 3 సార్లు రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం అవసరం అయినపుడు సంబంధిత రక్త గ్రూపు కలిగిన దాతలు ముందుకు రావాలి, మరో ప్రాణం నిలపడానికి వచ్చిన అద్భుత అవకాశాన్ని తీసుకోవాలి. రక్త కొరతతో ప్రాణాలు పోకుండా యువ దాతలు నడుం బిగించాలి. అభాగ్యుల ప్రాణాలు నిలుపడానికి డబ్బు మాత్రమే అవసరం కాదని, నిరుపేద యువకుడు కూడా రక్త దానం చేసిన మరొకరి ప్రాణం నిలుపవచ్చని తెలుసుకోవాలి. అత్యధిక యువత ఉన్న భారతంలో రుధిర కొరత వేధించడం అవమానకరం అని భావిద్దాం, స్వచ్ఛంద రక్తదాతలుగా మారుదాం.



**- మధుపాళీ , 9949700037**

# హార్డ్‌వేర్ పార్క్ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**23 ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదానికి తెరదించాలి**

**నోటిఫికేషన్ రద్దు చేయాలి.. 22-ఏ జాబితా నుంచి భూములను తొలగించాలి**

**భూ బాధితులు, రైతులు, ప్లాట్ల యజమానుల సమస్యలను పరిష్కరించాలి**

**బషీర్‌బాగ్‌లో అఖిలపక్ష సదస్సులో వక్తల డిమాండ్**



బడంగ్‌పేట్ సర్కిల్, అరుణప్రభ: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని నాదర్‌గుల్, ఆదిబట్ల, ఎం.ఎం.కుంట ప్రాంతాల్లో హార్డ్‌వేర్ పార్క్, వర్క్ సెంటర్ పేరుతో గత 23 ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అఖిలపక్ష సదస్సులో పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ పరిధిలోకి వచ్చినప్పటికీ ప్రభుత్వం సేకరించని భూములు, నష్టపరిహారం అందని వ్యవసాయ భూములు, వేలాది నివాస ప్లాట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే హార్డ్‌వేర్ పార్క్ పరిధి నుంచి తమ భూములను తొలగించాలని పోరాడుతున్న భూ యజమానులకు, ఇటీవల ఆయా భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడం మరింత ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ (జేఏసీ), తెలంగాణ జన సమితి (టీజేఎస్) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అఖిలపక్ష సదస్సులో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈటీ నరసింహ తదితరులు పాల్గొని భూ సమస్యలపై మాట్లాడారు. హార్డ్‌వేర్ పార్క్ భూ సమస్య పరిష్కారానికి బాధితులు, రైతులు, ప్లాట్ల యజమానులు ఐక్యంగా ఉద్యమించాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. 2004లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ రెండు దశాబ్దాలకు పైగా గడిచినా హార్డ్‌వేర్ పార్క్ కోసం సేకరించిన భూమి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని అన్నారు. మరోవైపు భవిష్యత్తు అవసరాల కోసం కష్టపడి సంపాదించిన డబ్బులతో వేలాది మంది కొనుగోలు చేసిన ప్లాట్లను వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ ప్రక్రియ సక్రమంగా జరగలేదని పేర్కొంటూ ఆ ప్రక్రియను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తుచేశారు. అయినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించకపోవడంతో భూ యజమానులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డితో చర్చించడంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు కోదండరాం వెల్లడించారు. సంబంధిత అధికారులు సమగ్ర వివరాలు, సర్వే నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సమస్య ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన కీలక దశకు చేరుకుందని, అందుకే అఖిలపక్ష సదస్సు నిర్వహించినట్లు వివరించారు. ప్రతి లేఅవుట్‌కు సంబంధించిన భూములు, ప్లాట్లు, యజమానుల వివరాలను సేకరించి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి అందజేయాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అవసరమైతే తదుపరి కార్యాచరణను జేఏసీ నిర్ణయిస్తుందని, సమస్య పరిష్కారమయ్యే వరకు బాధితులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. విడివిడిగా చేసే ప్రయత్నాల వల్ల సమస్య పరిష్కారం కాదని, సమష్టిగా కదిలితేనే న్యాయం సాధించగలమని పేర్కొంటూ "బలహీనుడికి ఆయుధం ఐక్యత" అని పిలుపునిచ్చారు. హార్డ్‌వేర్ పార్క్ కోసం 2004లో ఎంత భూమిని సేకరించారు? ప్రస్తుతం ఎంత భూమి వినియోగంలో ఉంది? ఇంకా ఎంత భూమి నిరుపయోగంగా ఉంది? అనే అంశాలపై పూర్తి వివరాలు సేకరించాల్సిన అవసరం ఉందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ వివరాల కోసం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) అధికారులతో మాట్లాడతానని తెలిపారు. హార్డ్‌వేర్ పార్క్ పరిధిలో గ్రామపంచాయతీ లేఅవుట్ల ద్వారా ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న వారు, భవిష్యత్తు అవసరాల కోసం స్థలాలు కొనుగోలు చేసిన కుటుంబాలు కూడా ఉన్నాయని చెప్పారు. వారి సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ప్రభుత్వ భూములు, ఇప్పటికే పరిశ్రమలకు కేటాయించిన భూములను విడివిడిగా గుర్తించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. ఈ ప్రాంతంలో భూ సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈటీ నరసింహ అన్నారు. భూదాన్ భూములకు సంబంధించి గతంలో అధికారులే పట్టాలు మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుతం ఆ భూములు కూడా నిషేధిత జాబితాలో ఉండటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆదిబట్లలో భూదాన్ భూముల పరిధిలో సుమారు వెయ్యి ప్లాట్లను నిరుపేదలకు కేటాయించినప్పటికీ, వాటిని వినియోగించుకునేందుకు ఇప్పటికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సదస్సులో పాల్గొన్న ఇతర వక్తలు మాట్లాడుతూ హార్డ్‌వేర్ పార్క్ కోసం భూసేకరణ పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులతో పాటు దాదాపు 20 వేల నివాస ప్లాట్ల యజమానుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ పరిధిలోకి వచ్చినప్పటికీ సేకరించని భూములు, నష్టపరిహారం అందని వ్యవసాయ భూములు, నివాస స్థలాలపై నెలకొన్న వివాదాలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, టీజీఐఐసీ అధికారులు, భూ యజమానుల ప్రతినిధులతో సమగ్ర చర్చలు నిర్వహించాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా కాలపరిమితితో కూడిన కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని కోరారు. హార్డ్‌వేర్ పార్క్ భూ సమస్య పరిష్కారమయ్యే వరకు అఖిలపక్షంగా, సంఘటితంగా పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## సర్ కు వ్యతిరేకంగా అఖిలపక్ష ర్యాలీ

**ఎన్నికల కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి.. సర్ ను రద్దు చేయాలని డిమాండ్**

హైదరాబాద్: సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా అఖిలపక్షం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు దేశ పౌరులందరికీ సహజంగా దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం, రాష్ట్ర నాయకులు కొండ విశ్వేశ్వరరావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మారం లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల దయాకర్, ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాస్, వెంకట చారి, జిల్లా ఇన్‌చార్జి పల్లె వినయ్ కుమార్, రాష్ట్ర నాయకులు అశోక్‌రెడ్డి, జిల్లా నాయకులు



రాజు ముదిరాజ్, రవికుమార్, దయాకర్ గౌడ్, అధికార ప్రతినిధి ప్రవీణ్ ఆర్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుకన్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య సేవలతో పేదలకు అండగా నిలుస్తున్నా ఆశ్రమం హాండ్స్ అఫ్ హోప్ సంస్థ

**తిమ్మాపూర్ లో మెగా ఉచిత వైద్య శిబిరం**

**పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవలు అందించడం అభినందనీయం సర్పంచ్ పోసాన్ పల్లి రాజు**

జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం ఆశ్రమం హాండ్స్ అఫ్ హోప్ సంస్థ సహకారం తో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోసాన్ పల్లి రాజు మాట్లాడుతూ పేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ హ్యాండ్స్ ఆఫ్ హోప్ సంస్థ మానవతా సేవలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. హ్యాండ్స్ ఆఫ్ హోప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవల్లో భాగంగా ప్రజలకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కీళ్ల నొప్పులు, ఈసీజీ, ఎక్స్‌రే తదితర వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారు. అవసరమైన వారికి వైద్యుల సలహాలు, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో హ్యాండ్స్ ఆఫ్ హోప్ సంస్థ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు. ఆరోగ్యాన్ని కాపాడటం కంటే గొప్ప సేవ మరొకటి లేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యానికి దూరమయ్యే పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం నిజమైన మానవత్వానికి నిదర్శనం" అని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ముందుకు వచ్చి సేవలందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, హ్యాండ్స్ ఆఫ్ హోప్ సంస్థ నిర్వాహకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ అక్కరాజు నాగరాజు అడ్వొకెట్ వీరబాత్తిని రామకృష్ణ తలకొక్కుల శ్రీశైలం ఆశ్రయం హ్యాండ్ అఫ్ హోప్ జంగ జయరాజు - కో ఆర్డినేటర్ డాక్టర్ ఈశ్వర్ డాక్టర్ ఉతేజ్ డాక్టర్ యాసీన్ డాక్టర్ సంపత్ శామ్యూల్ స్వామి రవి శివ సామ్ కంచి వార్డు మెంబర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు - 14 వ రోజు

అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో, ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 14 వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు దీక్షలో బి. వెంకట రాజు, పి, శ్రీనివాస్ గౌడ్ కూర్చున్నారు ఈ కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ,ముత్యాలు, అనంతుల సంతోష్, శేరుపల్లి మల్లేష్,రమేష్ శ్రీనివాస్ చారి, ధనంజయ్ రెడ్డి,తదితరులు పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.



## పంచశీల కాలనీలో కన్వా హాస్పిటల్ ప్రారంభం

అల్వాల్: పంచశీల కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కన్వా హాస్పిటల్‌ను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. అల్వాల్ తహసీల్దార్ రాములు, డిప్యూటీ కమిషనర్ అల్వాల్ భోగేశ్వరులు, మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ దీపక్ బచ్చు కలిసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ దీపక్ బచ్చు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కన్వా హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

EDITED, PRINTED, PUBLISHED & OWNED BY GURRAM PAPI REDDY, # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501511. TELANGANA. PRINTED AT: GARUDA PRINT-ERS, # H.NO.2-86/1, PLOT NO.23-SP, SYNO.417, SAGAR HIGHWAY, RANGANNAGUDA VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501510. TELANGANA. PUBLISHED AT: # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT. 501511. TELANGANA....WWW.ARUNAPRABHA.COM.EMAIL.ARUNAPRABHADAILY@GMAIL.COM, RNI NO. TELTEL/2023/89778, CELL NO. 9700127889.